













కర్నూలు జిల్లా మహనీయులు

మొదటి తరం


డా॥ ఎం. హరికిషన్







మొదటి తరం

కర్నూలు జిల్లా
మహనీయులు

డా॥ ఎం. హరికిషన్

94410 32212

కర్నూలు బుక్ ట్రస్ట్

కర్నూలు జిల్లా మహనీయులు

రచయిత:
డా॥ ఎం. హరి కిషన్
45/205-1, టీచర్స్ కాలనీ,
కర్నూలు. సెల్: 94410 32212
email: drmharikishan@rediffmail.com

ముఖచిత్రం : మాష్టర్ క్రాంతి, సెల్: 99635 55547
కవర్ డిజైన్ : టి.సాయిబాబా, సెల్: 75698 88092
డిటిపి : దస్తగిరి, సెల్: 88861 74872

ప్రచురణ, ప్రతులకు
డా॥ ఎం. హరి కిషన్ - 9441032212

కర్నూలు బుక్ ట్రస్ట్
డా॥ ఎం. హరికిషన్
45/205-1, లేబర్ కాలనీ చర్చ్ ఎదురుగా
టీచర్స్ కాలనీ, కర్నూలు.
సెల్ : 94410 32212

కృతజ్ఞతలు

ఈ పుస్తకంలో మొదట ఇరవై మంది మహనీయుల గురించి మాత్రమే పరిచయం చేయడం జరిగింది. ఇది ఆరంభం మాత్రమే. వరుసగా ఇలా కర్నూలుజిల్లాకు చెందిన మహనీయుల గురించి అనేక చిన్న చిన్న పుస్తకాలు ప్రచురించాలనేది నా ఆకాంక్ష.

పుస్తకంలోని చిత్రాలను నాకు నచ్చేంతవరకు ఎంతో ఓపికగా వేసి అందించిన మిత్రుడు 'మాష్టర్ క్రాంతి' కి...

పుస్తకంలో అచ్చుతప్పులు లేకుండా అందంగా రూపుదిద్దుకోవడంలో శ్రమించిన నా శ్రీమతి డా॥ కె. చంద్రమౌళినికి....

ప్రేమతో....



ముతుకూరి గౌడప్ప

దత్తమండలాలలో బ్రిటిష్ వారిపై తొలి తిరుగుబాటుకు నాయకత్వం వహించిన వీరుడు, రైతుల సంక్షేమం కోసం పెంచిన పన్నులను వ్యతిరేకిస్తూ ఎదురు తిరిగిన ధీశాలి, తెర్నేకల్లు గ్రామపెద్ద ముతుకూరి గౌడప్ప.

నిజాం నవాబు బ్రిటిష్ వారితో సైన్య సహకార పద్ధతికి ఒప్పుకొని వాళ్ళ సైన్యాన్ని తన రాజ్యంలో వుంచుకొని ఒప్పందం ప్రకారం ప్రతి ఏటా కొంత సొమ్ము ఈస్ట్ ఇండియా కంపెనీకి అందించసాగాడు. కానీ కొంత కాలానికి ఆ సొమ్ము చెల్లించడం కష్టమై డబ్బుకు బదులు బళ్ళారి, అనంతపురం, కడప, కర్నూలు ప్రాంతాలను వారికి దత్తత ఇచ్చి, తాము ఇవ్వాల్సిన సొమ్మును ఆ ప్రాంతంలో వసూలు చేసుకోమన్నాడు. అలా 1800 సంవత్సరం అక్టోబరు 12 న ఈ ప్రాంతాలన్ని బ్రిటిష్ వారి ఆధీనంలోనికి వెళ్ళిపోయాయి. అప్పటినుంచీ వీటిని సీడెడ్ జిల్లాలు లేదా దత్తమండలాలు అంటున్నారు. తర్వాత ఈ ప్రాంతాన్నే రాయలసీమగా 1900 నుంచీ పిలుస్తున్నారు.

దత్తమండలాలు మొత్తం ఒక కలెక్టరేట్‌గా వుండేది. హెడ్‌క్వార్టర్ అనంతపూర్. ప్రిన్సిపల్ కలెక్టర్‌గా థామస్ మన్రో వుండేవాడు. అతని క్రింద నలుగురు సబ్ కలెక్టర్లు వుండేవాళ్ళు. ఆదోని సబ్‌కలెక్టర్ విలియం థాకరే. కలెక్టర్ అంటే తన క్రింద వున్న గ్రామాలనుంచి పన్నును వసూలు చేసి పైన అధికారులకు పంపించే అధికారం కలవాడు అని అర్థం.

దత్తమండలాలు ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనలోనికి వచ్చే సమయానికి వాళ్ళు మైసూరుతో యుద్ధాలు చేసి ఆర్థికంగా దివాలా తీశారు. దాంతో కొత్తగా తమ ఆధీనంలోనికి వచ్చిన ప్రాంతాలనుంచి ఎక్కువ ఆదాయాన్ని రాబట్టుకోవాలనుకున్నారు. దాంతో గ్రామాలపై ఎక్కువ పన్నును విధించి నిర్బంధంగా వసూలు చేయసాగారు. గ్రామాల్లో పన్నును వసూలు చేయాల్సిన బాధ్యత రెడ్డి, కరణాలపై వుండేది. ఎవరైనా ఎదురు తిరిగితే తమ సైనిక బలగంతో దాడి చేసి నిర్ధాక్షిణ్యంగా అణచివేసి, చంపి, ఆ గ్రామాలను నాశనం చేసి చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు భయపడేలా ప్రవర్తించేవారు. ఆ సమయంలో రాయలసీమలోని అనేక గ్రామాలు వరుస కరువుల్తో అల్లాడుతుండేవి.



డా॥ ఎం. హరి కిషన్

దత్తమండలాలనుంచి ఈస్ట్ ఇండియా కంపెనీ ఆశించిన మొత్తం కంటే తక్కువ పన్ను వసూలు అయింది. దాంతో వాళ్ళు మరో యాభైశాతం పన్ను అదనంగా పంచారు.

తెర్నేకల్లు గ్రామం ఆదోని డివిజన్‌లోని దేవనకొండ మండలంలోని ఒక గ్రామం. దానికి గ్రామ పెద్ద ముతుకూరి గౌడప్పయితే రెడ్డి కర్రెన్న. తెర్నేకల్లు గ్రామ ప్రజలు మొదటి నుంచీ స్వతంత్రంగా, పౌరుషవంతులై, స్వేచ్ఛను కాంక్షిస్తూ వుండేవారు. అనేక పోరాటాలలో పాల్గొన్న గ్రామం అది. ఆంగ్లేయులు ఆదోనిలోని జమాబందీకి వచ్చి భూమిశిస్తు చెల్లించాలని శ్రీనివాసరావు అనే అధికారితో చెప్పి పంపారు. తమ గ్రామ విషయంలో ఆంగ్లాధికారులు ప్రవేశించడం అక్కడి ప్రజలు సహించలేకపోయారు. అదీగాక అప్పటికే కరవు పరిస్థితుల వల్ల సరిగా పంటలు పండక రైతులు చాలా బాధల్లో వున్నారు. ఆ సమయంలో ఆంగ్లేయులు భూమిశిస్తును మరింత పెంచడం వారికేమాత్రం రుచించలేదు.

ఆ గ్రామపెద్ద ముతుకూరి గౌడప్ప. అతని నాయకత్వంలో రెడ్డి, కరణాలు కంపెనీ గుమాస్తా శ్రీనివాసరావును కలిశారు. శిస్తు చాలా ఎక్కువగా వుందనీ, పన్ను తగ్గిస్తే గానీ కట్టడం కుదరదని చెప్పారు. ఆ సమయంలో శ్రీనివాసరావు వెంట తెర్నేకల్లుకు మొదటి నుంచీ శత్రువులుగా వున్న గంజహళ్ళి సుంకిరెడ్డి, పెసలదిన్నె నారప్ప, బైలుప్పల రామిరెడ్డి వున్నారు. వారు ఆ మాటలకు అవహేళన చేస్తూ "మీ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించడానికి ఇది నవాబుల పాలన కాదు. కంపెనీ పాలన" అంటూ నోటికొచ్చినట్లు దురుసుగా మాట్లాడారు. ఆ మాటలతో కోపోద్రిక్తుడైన గౌడప్ప కనుసైగ చేసిన వెంటనే గ్రామ ప్రజలంతా ఒక్కసారిగా కత్తులు దూసి శ్రీనివాసరావును తప్ప మిగతా ముగ్గురినీ క్షణంలో చంపివేసి అక్కడికక్కడే బూడ్చిపెట్టారు.

శ్రీనివాసరావును వదలివేస్తే అతడు పోయి జరిగిన విషయమంతా పై అధికారులకు చెబుతాడేమోనని సందేహించి అతనిని కూడా నిర్బంధించారు. కానీ అతడు ఎవరికీ చెప్పనని ప్రమాణం చేసి బైటపడ్డాడు.

జరిగిన విషయం ఎలాగయినా బైటపడుతుందనే విషయాన్ని గ్రహించిన తెర్నేకల్లు గ్రామ పెద్దలు గ్రామ ద్వారాలన్నీ బాగు చేయించి, కోటగోడలన్నీ పటిష్ఠం చేసుకున్నారు. దాచిపెట్టిన ఆయుధాలన్నీ బైటకు తీసి సిద్ధం చేసుకున్నారు. వారు ఊహించిన విధంగానే శ్రీనివాసరావు ఆదోనికి చేరి అధికారులకు జరిగిందంతా వివరించాడు. అప్పుడు ఆదోని ప్రాంతానికి సబ్ కలెక్టర్‌గా ఆంగ్లేయాధికారి థాకరే వుండేవాడు. అతను జరిగింది తెలుసుకొని మండిపడి పెద్దసైన్యంతో తెర్నేకల్లుకు బైలుదేరాడు. సైన్యాన్ని కడివెళ్ళ గ్రామం వద్ద నిలిపి థాకరే తెర్నేకల్లు గ్రామ అధికారులను పిలిపించాడు. ఆదోనికి వచ్చి తక్షణమే పెంచిన శిస్తు కట్టేటట్లయితే వదలివేస్తామని, లేకపోతే గ్రామం మొత్తాన్ని సర్వనాశనం

చేస్తామనీ హెచ్చరించాడు. గ్రామాధికారులు అలాగేనంటూ లోపలికి పోయి తలుపులు మూసివేసి యుద్ధానికి సిద్ధమే గానీ, శిస్తు మాత్రం కట్టేది లేదని తెగేసి చెప్పారు.

థాకరే తన ఫిరంగులతో, తుపాకులతో, నాలుగు వందలమంది సైనికులతో కోటపై దాడి చేశాడు. లోపలి నుంచి వడిసెలతో, విల్లంబులతో, సలసల కాగుతున్న నీళ్ళు, నూనెలతో ఎదురుదాడికి దిగారు. తూర్పు, పశ్చిమ ద్వారాల వద్ద యుద్ధం పదహైదు రోజుల పాటు చాలా తీవ్రంగా జరిగింది గానీ ఆంగ్లేయులు కోటను స్వాధీనం చేసుకోలేకపోయారు. సంధి ప్రయత్నాలు చేశారు. పెంచిన శిస్తు విషయంలో ఇరువురూ పట్టుదలతో వుండడంతో అవి విఫలమయ్యాయి.

గుత్తి నుంచి వచ్చిన పెద్ద ఫిరంగులతో ఉత్తరద్వారంపై విరుచుకుపడ్డాడు. ఫిరంగి గుళ్ళ వర్షానికి ఆ ద్వారం బద్దలైంది. వెంటనే ఆంగ్ల సైన్యం తుపాకులతో లోపలికి దూరి కనపడ్డ వాళ్ళనందరినీ కాల్చివేయసాగింది. తెర్నేకల్లు వీరులు కత్తులతో, బాణాలతో వారినిఎదుర్కొన్నారు గానీ తుపాకుల ముందు నిలువలేకపోయారు.నలభైమందికి పైగా గ్రామస్తులు చంపబడ్డారు. ఆంగ్ల సైన్యాలు గౌడప్ప, రెడ్డి, కరణాలను బంధించివేశాయి. థాకరే వారి ముగ్గురినీ ఊరి వాకిలికి ఉరి తీయించాడు. చనిపోయిన గ్రామస్తులందరినీ తీసుకుపోయి గ్రామం ముందున్న కుక్కల బావిలో వేసి పూడ్చివేశారు. అంతటితో కక్ష తీరక గ్రామాన్నంతా సర్వనాశనం చేసి తగులబెట్టించి, కోటగోడలన్నీ ధ్వంసం చేసి గ్రామం నామరూపాలు లేకుండా నాశనం చేయించాడు.



తెర్నేకల్లులోని కుక్కల బావి

గులాం రసూల్‌ఖాన్

అలీఫ్‌ఖాన్‌కు ఆరుగురు కుమారులు. వారిలో చిన్నవాడు గులాం రసూల్‌ఖాన్. అలీఫ్‌ఖాన్‌కు చిన్న కుమారుడంటే చాలా ఇష్టం. అతనికే రాజ్యాధికారం అప్పగించాలని అతని కోరిక. దానితో పెద్దకుమారుడు మునావర్‌ఖాన్‌ను తిరుగుబాటు చేయకుండా కారాగారంలో బంధించాడు. కానీ ఇంగ్లీషువారు జోక్యం చేసుకొని 1813లో అతనిని విడిపించారు.

1815లో అలీఫ్‌ఖాన్ చనిపోవడంతో అతని కుమారులలో ఒకడైన ముజఫర్‌ఖాన్ సింహాసనాన్ని ఆక్రమించాడు. కానీ అది ఇష్టపడని ఇంగ్లీషువారు కర్నూలు కోటపై దాడి చేసి ముజఫర్‌ఖాన్‌ను ఓడించి పెద్దకుమారుడయిన మునావర్‌ఖాన్‌కు కోటను అప్పగించారు. ఈ సమయంలో ఆంగ్లేయులు కోటలో వున్న అనేక రికార్డులను పరిశీలించారు. తరతరాలుగా కర్నూలును పరిపాలిస్తున్న జాగీర్దారులు, వారి చరిత్ర, శిస్తులు మొదలగు అనేక విషయాలు ఐదారు గదుల నిండా ఒక పద్ధతి ప్రకారం వున్నాయట. బ్రిటీష్‌వారు వాటిని పరిశీలించే సమయంలో అవన్నీ కిందికీ మీదికీ అయిపోయాయి. మునావర్‌ఖాన్ వాటన్నింటినీ తిరిగి క్రమపద్ధతిలో సరిగా ఏర్పాటు చేయలేక గందరగోళపడి చిరాకుతో ఎందుకివన్నీ అనవసరంగా అని భావించి మొత్తం ఆ రికార్డులన్నీ ఏనుగులపైన, గుర్రాలపైన వేసుకొనిపోయి హంద్రీనదిలో పారవేయించాడట. ఆ విధంగా కర్నూలు చరిత్రకు సంబంధించిన అనేక విషయాలు ఇతని కాలంలో హంద్రీ గర్భంలో కలిసిపోయాయని కొందరు తెలియజేశారు. ఇతడు కర్నూలును ఎనిమిది సంవత్సరములు పరిపాలించి అనారోగ్యంతో చనిపోయాడు.

ఆంగ్లేయులు తిరిగి ముజఫర్‌ఖాన్‌ను పాలకునిగా తీసుకురావలెనని అనుకున్నారు. కానీ అతను ఆదోనిలో తన భార్యను హత్య చేసినందుకు గాను శిక్ష పడి బళ్ళారి జైలుకు పోయి అక్కడే చనిపోయాడు. మిగిలిన కుమారులంతా అసమర్థులు. దానితో చివరికి చిన్న కుమారుడయిన గులాం రసూల్‌ఖాన్‌కు నవాబుగిరీ దక్కింది.

క్రీ.శ .18వ శతాబ్దంలో వహాబీ ఉద్యమం కర్నూలు దాకా పాకింది. ఢిల్లీలోని షా అబ్దుల్ అజీజ్ శిష్యుడు సయిాద్ అహ్మద్ ఈ ఉద్యమాన్ని వ్యాప్తి చేశాడు. ఇతని అనుచరులు మౌల్వి విలాయత్ ఆలీ, సలీం అనేవారు దక్షిణ భారతదేశంలో ఉద్యమాన్ని ప్రచారం చేశారు. ముబారిజుద్దౌలా దీనికి నాయకుడయ్యాడు. ఇతడు హైదరాబాద్ సంస్థానాన్ని పరిపాలిస్తున్న నిజాంకు సోదరుడు. ఆంగ్ల ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ, వారిని తమ ప్రాంతం నుంచి తరిమివేయడం కోసం ముస్లింలు చేపట్టిన ఉద్యమమే వహాబీ ఉద్యమం.


Masterkranthi.R
2016

కర్నూలును పరిపాలించిన చిట్టచివరి నవాబు గులాం రసూల్‌ఖానే. గులాంరసూల్‌ఖాన్‌కు ఆంగ్లేయులపైన చాలా కోపం. ఏ మాత్రం అవకాశం దొరికినా వారిని పారద్రోలాలని ప్రయత్నిస్తూ వుండేవాడు. 1823లో కర్నూలు నవాబుగా అధికారం చేపట్టిన గులాంరసూల్‌ఖాన్ని వహాబీ ఉద్యమం ఎంతగానో ప్రభావితం చేసింది. నిజాం సోదరుడు ముబారిజుద్దౌలాతో చేతులు కలిపి ఎలాగయినా సరే ఆంగ్లేయులను ఈ ప్రాంతం నుంచి తరిమివేయాలని సిద్ధమయ్యాడు. ఎవరికీ తెలియకుండా తన అంతఃపురంలోనూ, తోటలలోనూ పెద్ద ఎత్తున నమ్మకస్తుల పహారా మధ్య ఆయుధ సామాగ్రిని తయారు చేసి భూగృహాలలో దాచిపెట్టసాగాడు. అనేకమైన తుపాకులు, మందుగుండు సామాగ్రి, కత్తులు, బల్లాలు, ఫిరంగులు అందులో వున్నాయి. మరోపక్క కోటకు మరమ్మత్తులు చేయిస్తూ పటిష్ఠం చేయసాగాడు. ఈ విషయం కర్నూలును పర్యవేక్షిస్తున్న బ్రిటీష్ ప్రతినిధికి తెలిసింది. కానీ ఎక్కడా ఎటువంటి ఆధారాలు కనిపించడం లేదు. దాంతో వెంటనే పై అధికారులకు విషయం చేరవేశాడు.

ఆంగ్లప్రభుత్వం టి.ఎల్. బ్లేన్ నాయకత్వంలో ఒక ఎంక్వైరీ కమీషన్ను నియమించింది. వారు ఎంత విచారించినా, వెదికినా ఎటువంటి ఆనవాలు దొరకలేదు. కానీ కోటలో రహస్యంగా ఏదో జరుగుతున్న విషయం మాత్రం గ్రహించగలిగి బ్రిటీష్ ప్రెసిడెంటు ఫ్రేజర్‌కు తెలియపరిచారు. దాంతో ఎ.బి.డైస్ నాయకత్వంలో 1839లో ఆంగ్లసైన్యం కర్నూలులో ప్రవేశించింది. కోటను తమకు అప్పగించాలనీ, తాము తనిఖీ చేయాలనీ, అంతవరకూ రాజభవనం వదలి వెళ్ళాలనీ ఆదేశించారు. తప్పనిసరి పరిస్థితుల్లో రసూల్‌ఖాన్ కొద్దిపాటి సైన్యంతో జొహరాపురంలోని హజ్రత్ అహ్మద్‌షా ఖాద్రి దర్గా ఆవరణలోకి చేరుకున్నాడు.

రసూల్‌ఖాన్ మేనమామ మియాందారీఖాన్. అతను రాజ్యాధికారాన్ని తాను పొందాలనే దురాశతో కోటలో ఎక్కడెక్కడ ఏమేమి జరుగుతుందో బ్రిటీష్ వారికి రహస్యంగా గుట్టుమట్లు వివరించాడు. అతడు అందించిన సమాచారం ప్రకారం వీరు అంతఃపురంలోనూ, రాణీతోటలోనూ, భూగృహాలలోనూ పెద్దఎత్తున దాచిపెట్టుకున్న ఆయుధాగారాలను కనుగొనడం జరిగింది. దాంతో విచారణ నిమిత్తం రసూల్‌ఖాన్‌ను బంధించడానికి డైస్ నాయకత్వంలోని సేనలు బైలుదేరాయి. 1839 అక్టోబర్ 18న జొహరాపురం వద్ద జరిగిన యుద్ధంలో అనేకమంది నవాబు సైనికులు, ఆంగ్ల సిపాయిలు మరణించారు. చివరికి బ్రిటీష్ వారు గులాం రసూల్‌ఖాన్‌ను బంధించి తిరుచునాపల్లి కారాగారంలో బంధించారు. అధికారాన్ని మేనమామ మియాందారీఖాన్‌కు అప్పజెప్పకుండా తామే చేపట్టారు. కొంతకాలానికి గులాంరసూల్‌ఖాన్ తిరుచునాపల్లి కారాగారంలోనే హత్య చేయబడ్డాడు. గులాంరసూల్‌ఖాన్ క్రిస్టియన్‌గా మతం మార్చుకొని చర్చికి పోయి వస్తూ వుండడంతో అది చూడలేక నవాబు సహాయకుడు ఒకడు పొడిచి చంపివేశాడని బ్రిటీష్ అధికారులు చెబుతూ వుంటే ఇంగ్లీషువారే అతని సహాయకున్ని డబ్బుతో వశపరచుకొని అతని ద్వారా విషప్రయోగం చేయించి చంపించారని ఇతరులు చెప్పుకొంటున్నారు. ఆ విధంగా గులాంరసూల్‌ఖాన్ మరణంతో కర్నూలు ప్రాంతం పూర్తిగా ఆంగ్లేయుల వశమయ్యింది.

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి

సిపాయిల తిరుగుబాటుకు సరిగ్గా పది సంవత్సరాల ముందు 1846-47 మధ్య కాలంలో ఆంగ్లేయులపై తిరుగుబాటు జెండా ఎగురవేసి ముప్పుతిప్పలు పెట్టి గడగడలాడించిన రేనాటి వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి.

కడప జిల్లాలోని జమ్మలమడుగు, కర్నూలు జిల్లాలోని కోవెలకుంట్ల తాలుకాలను కలిపి రేనాడుగా పిలిచేవారు. 19వ శతాబ్దంలో కడప జిల్లాలో భాగంగా వున్న ఈ రేనాటి ప్రాంతంలోని కోవెలకుంట్ల ప్రస్తుతం కర్నూలు జిల్లాలో వుంది. ఆ కోవెలకుంట్ల తాలుకా, ఉయ్యాలవాడ మండలంలోని రూపనగుడి గ్రామం నరసింహారెడ్డి జన్మస్థలం.. తండ్రి పెదమల్లారెడ్డి. తల్లి సీతమ్మ. ఇతను ఎక్కువ కాలం ఉయ్యాలవాడలోనే వుండడంతో ఇతనికి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని పేరు వచ్చింది. ఇతని తండ్రి పెదమల్లారెడ్డి ఒక పాలెగాడు. మద్రాసు కాలంలో పాలెగాళ్ళ జాగీర్లన్నీ బ్రిటీష్‌వారు స్వాధీనం చేసుకొని వారికి పింఛను ఏర్పాటు చేశారు. అలా ఉయ్యాలవాడ జాగీరును వశం చేసుకొని నెలకు డెబ్బై రూపాయల పింఛను ఇచ్చేవారు. ఇందులో సగం పెదమల్లారెడ్డి సోదరుడు చినమల్లారెడ్డికి పోయేది. మిగతా ముప్పై ఐదు రూపాయల్లో పెదమల్లారెడ్డి ముగ్గురు కుమారులకు సమానంగా పంచగా నరసింహారెడ్డికి పదకొండు రూపాయలా పది అణాల ఎనిమిది పైసలు వచ్చేది.

నొస్సం జమీందారు జయరామిరెడ్డి. ఇతడు కొత్తకోట, జయరామపురం, కోవెలకుంట్ల, గిద్దలూరు, కంభం ప్రాంతాలలోని 70 గ్రామాలకు అధిపతి. బ్రిటీష్‌వారు చిన్న చిన్న రాజ్యాలను, సంస్థానాలను తమ సామ్రాజ్యంలో కలుపుకొంటూ వారిలో తిరుగుబాటు రాకుండా పెన్షన్ ఇచ్చే పద్ధతిని ఏర్పాటు చేయసాగారు. జయరామిరెడ్డికి నెలనెలా వెయ్యి రూపాయల పింఛను ఇచ్చేవారు. ఇతనికి ఒక కొడుకు, కూతురు వున్నారు. కొడుకుకు పిల్లలు లేరు. అతను చనిపోవడంతో కూతురు కొడుకైన నరసింహారెడ్డిని దత్తత తీసుకున్నాడు. కానీ జయరామిరెడ్డి మరణానంతరం ఆంగ్లేయ ప్రభుత్వం వారసులకు పింఛను ఇవ్వకుండా నిలిపివేసింది.

ఇంగ్లీషువారు క్రమక్రమంగా కట్టుబడి వంశపారంపర్య హక్కులు రద్దు చేస్తూ వారి మాన్యాలను స్వాధీనం చేసుకోసాగారు. ఇది కట్టుబడి బంట్రోతులను తీవ్ర అసంతృప్తికి గురి చేసింది. అప్పటి


Masterkranthi.R

కలెక్టర్‌గా వున్న జె. హెచ్. కా(క్రేన్ వైఖరితో జాగీరులు, ఇనాంలు కోల్పోయిన నవాబులు, పాలెగాళ్ళు, శిస్తు కట్టలేని ప్రజలు, పుల్లరి కోల్పోయిన కొండజాతుల ప్రజలు అంతా తీవ్ర అసంతృప్తితో రగిలిపోసాగారు.

1846 జూన్ నెలలో తనకు రావాల్సిన పింఛను కోసం నరసింహారెడ్డి ఒక చీటీ రాసి సేవకున్ని కోవెలకుంట్ల ట్రెజరీకి పంపించాడు. తహశీల్దార్ పింఛను ఇవ్వకపోగా "ఆ నరసింహ దాసరి క్రింద ఇంకో దాసరా? ఆ నరసింహ దాసరినే రమ్మనుపో" అంటూ అవహేళన చేశాడు. దీంతో నరసింహారెడ్డి ఆత్మాభిమానం దెబ్బ తినింది. "రేపు మధ్యాహ్నం పన్నెండు గంటలకు నరసింహదాసరే నీ వద్దకు వస్తాడు కాసుకో" అంటూ అదే సేవకునితో తిరిగి కబురు పంపాడు.

తరువాతరోజు నరసింహారెడ్డి ఐదువందల మంది బోయల్ని సైన్యంగా సమకూర్చుకొని పట్టపగలు చెప్పిన సమయానికి కోవెలకుంట్ల ట్రెజరీ మీద దాడి చేశాడు. అడ్డం వచ్చిన తహశీల్దారు, కాపలావాని తలలు నరికి పోలీసుల్ని చంపి ట్రెజరీలోని సొమ్మంతా దోచుకొని తగలబెట్టాడు. ఆ తలల్ని తీసుకొని వచ్చి నయనాలప్ప కొండ మీది శివాలయం పక్కనే వున్న గుహల్లో దాచిపెట్టాడు.

ట్రెజరీని దోచుకున్న విషయం కడప కలెక్టర్ కా(క్రేన్‌కు తెలిసింది. పోలీసులు నరసింహారెడ్డి వద్దకు వచ్చి కోవెలకుంట్లలో జరిగిన హత్యల గురించి ఆయన్నే ప్రశ్నించారు. దానికి నరసింహారెడ్డి అమాయకంగా తనకేమీ తెలియదని, బహుశా ఔకురాజులు చేసి వుండవచ్చునేమో అని చెప్పాడు. దాంతో బ్రిటీష్ వారు ఔకురాజును బంధించి కారాగారంలో వేశారు.

తరువాత పోలీసులు పరిశోధన చేసి నయనాలప్ప కొండల్లో దాచిన శిరస్సుల్ని కనుగొన్నారు. నరసింహారెడ్డి అనుచరుల్ని బంధించి జరిగిన విషయమంతా కనుక్కొని బంధించడానికి పోలీసుల్ని పంపారు. కానీ వాళ్ళు నరసింహారెడ్డిని ఏమీ చేయలేక తన్నులు తిని తిరిగి వచ్చారు.

పోలీసులు అతన్ని బంధించడానికి భయపడసాగారు. నరసింహారెడ్డి తిరుగుబాటుతో అంతవరకూ అసంతృప్తితో రగిలిపోతున్న వారంతా ఒకొక్కరే ఏకం కాసాగారు. కట్టుబడి బంట్రోతులు, చెంచులు, వడ్డెలు, బోయలు, యానాదులు, కొందరు బ్రాహ్మణులు అతని సైన్యంలో చేరిపోయారు. అనేకమంది జమీందారులు, సంస్థానాధీశులు, నవాబుల అండదండలు కూడా వారికి లభించాయి. దాదాపు తొమ్మిదివేల దాకా వీరి సైన్యం పెరిగింది. గోసాయి వెంకన్న, ఒడ్డె ఓబన్న నరసింహారెడ్డికి నమ్మినబంట్లుగా వుండేవారు.

దానితో కలెక్టర్ కా(క్రేన్ నరసింహారెడ్డిని బంధించడానికి పెద్ద సైన్యాన్ని పంపించమని దత్తమండలాల సైనికాధికారికి కబురు పంపాడు. కడప, కర్నూలు, బళ్ళారి, కంభం, సికింద్రాబాద్‌ల నుంచి సైన్యం నరసింహారెడ్డిని బంధించడానికి అన్నివైపులా చుట్టుముట్టసాగింది. కంభం నుంచి వస్తున్న లెఫ్టినెంట్

వాట్సన్ నాయకత్వంలోని సైన్యానికి, నరసింహారెడ్డి సైన్యానికి మధ్య 1846 జూలై 23న గిద్దలూరు సమీపంలో ఐదుగంటల పాటు హోరాహోరీగా యుద్ధం జరిగింది. ఇరువైపులా అనేకమంది చనిపోయారు. ఆఖరికి వాట్సన్ నరసింహారెడ్డి ధాటికి తట్టుకోలేక తన సైన్యాన్ని తీసుకొని సెట్టివీడు గ్రామానికి పారిపోయాడు. నరసింహారెడ్డి తన సైన్యంతో ముండ్లపాడు గ్రామం చేరుకున్నాడు.

తరువాత రోజు వాట్సన్ సైన్యానికి, కర్నూలు నుంచి వచ్చిన కెప్టెన్ నాట్, కెప్టెన్ రసూల్ సైన్యాలు కలిశాయి. వీరికి కంభం తహశీల్దార్ తోడుగా నిలిచాడు. అందరూ కలసి ముండ్లపాడు వద్ద నరసింహారెడ్డిపై దాడి చేశారు. ఆ యుద్ధంలో నరసింహారెడ్డి కంభం తహశీల్దారును చంపి తన సైన్యంతో తప్పించుకొన్నాడు. వీరు కొత్తకోటలో తన తండ్రి నిర్మించిన కోటకు అనుచరులతో చేరుకున్నారు. కోటపై ఒక బురుజు నిర్మించి పందొమ్మిది ఫిరంగులను చుట్టూరా ఏర్పాటు చేసి గొరిల్లా తరహా పోరాటానికి తెర తీశాడు. నల్లమల అడవుల్లో రోజుకో ప్రదేశం మారుస్తూ బ్రిటీష్ సైన్యంపై దాడి చేస్తూ వారిని ముప్పుతిప్పలు పెట్టసాగాడు.

రోజురోజుకూ నరసింహారెడ్డికి ప్రజల్లో పెరిగిపోతున్న పలుకుబడిని గమనించిన ఆంగ్లేయ ప్రభుత్వం అతన్ని ఎలాగైనా సరే పట్టుకోవాలని అతని కుటుంబాన్ని కడపలో బంధించింది. కానీ అతను లొంగిపోలేదు. యుద్ధంలో పట్టుబడిన నరసింహారెడ్డి సైనికుల్ని హింసించి వారి ద్వారా అనేక విషయాలు తెలుసుకున్నారు. నరసింహారెడ్డికి వంట చేసే పనిమనిషి పేరు జానకమ్మ. జానపద గీతాలలో ఈమెను అతని ఉంపుడుగత్తెగా కొందరు చెబుతారు. ఆమెకు కావలసినంత ధనమిచ్చి నరసింహారెడ్డి ఎర్రమల, నల్లమల కొండల మధ్య గల పేరుసోమల కొండల్లోని జగన్నాథ దేవాలయంలో వున్నాడని సమాచారం సేకరించారు. కలెక్టర్ కాక్రేన్ మొత్తం సైన్యాన్నంతా తీసుకొని రహస్యంగా కొండల చుట్టూ మోహరించి ఒక్కసారిగా అన్ని వైపుల నుంచి తుపాకులతో కాలుస్తూ దాడి చేశారు. ఇరు సైన్యాల మధ్య ఘోరమైన యుద్ధం జరిగింది. బ్రిటీష్ తుపాకుల ముందు నరసింహారెడ్డి సైన్యం నిలువలేక పోయింది. ఆఖరికి గాయపడ్డ నరసింహారెడ్డిని, అతని సైన్యాన్ని 1846 అక్టోబర్ 6న బంధించగలిగారు.

నరసింహారెడ్డిపై రాజద్రోహ నేరం మోపి విచారణ కోసం గ్రామస్తులను పిలువగా అతనికి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పడానికి ఒక్కరు కూడా పోలేదు. చివరికి వారే విచారణ చేసి 1847 ఫిబ్రవరి 22న కోవెలకుంట్ల వద్ద గల జుర్రేరు వాగు వద్ద జనులందరూ చూస్తుండగా నరసింహారెడ్డిని ఉరి తీశారు. ప్రజల్లో తమ పట్ల తిరుగుబాట్లు తలెత్తకుండా, వారిని భయభ్రాంతులకు గురి చేయడం కోసం మరణించిన అతని శిరస్సును ఉయ్యాలవాడ కోట గుమ్మానికి వేలాడ తీశారు. 1877 వరకు ఆ శిరస్సు తాలూకు కపాలం ఆ కోట గుమ్మానికి అలాగే వేలాడుతూ చివరికి గుమ్మంతో పాటే శిథిలమైంది.

బుడ్డా వెంగళరెడ్డి

బుడ్డా వెంగళరెడ్డి కోవెలకుంట్ల తాలుకాలోని ఉయ్యాలవాడలో నల్లపురెడ్డి, వెంకమ్మ దంపతులకు 1822లో జన్మించాడు. ఇతనికి చిన్నప్పటి నుంచీ పేద ప్రజలన్నా, ఆపదల్లో వున్న అసహాయులను ఆదుకోవడమన్నా ఎంతో ఇష్టం. దారి దోపిడీలు చేసే దొంగలు సైతం ఇతని బోధనలు విని మంచిగా మారిపోయారని చెబుతారు.బుడ్డా వెంగళరెడ్డికి అపరదానకర్ణుడని పేరు. అతని ధాతృత్వానికి గుర్తుగా అనేక సంఘటనలు జానపద గాధలలో బహుళ ప్రచారంలో వున్నాయి.

ఒక మండు వేసవిలో ఒక బ్రాహ్మణుడు వెంగళరెడ్డి ఇంటికి వచ్చి చానా దాహంగా వుంది కొంచెం మజ్జిగ ఇవ్వమని కోరాడట. ఆ సమయంలో పడుకొని వున్న వెంగళరెడ్డి భార్య లేవడానికి బద్దకించి 'మజ్జిగ లేవు' అని చెప్పిందట. దానితో ఆ బ్రాహ్మణుడు నిరాశతో వెళ్ళిపోతోంటే అది చూసిన వెంగళరెడ్డి అతనిని ఆపి ఒక్క క్షణం అంటూ ఇంటిలోపలికి పోయి వెతికితే కుండ నిండుగా మజ్జిగ కనబడ్డాయి. దానితో జరిగిన తప్పు అర్థమై ఆ బ్రాహ్మణున్ని కాసేపు కూర్చోమని చెప్పి అప్పటికప్పుడు వంట చేయించి కడుపు నిండా అన్నం పెట్టడమే గాక, ఆవుదూడలను గూడా దానం ఇచ్చి పంపాడట.

అలాగే ఒకనాడు బిచ్చగత్తె అయిన ఫకీరు స్త్రీ చినిగిన బట్టలతో రచ్చబండ దగ్గర కూర్చున్న వెంగళరెడ్డి దగ్గరికి వచ్చి తనకు ఏదైనా ఒక పాత చీర దానమివ్వమని వేడుకొంది. ఆమె దీనావస్థకు చలించిపోయి 'ఇంటికి పోయి నేను ఇమ్మన్నానని చెప్పి తెచ్చుకోపో' అని పంపించాడు. కానీ ఇంటిలో ఆయన భార్య 'ఇప్పుడు పాత చీరలు ఏవీ లేవు. ఇంకోసారి రా ఇస్తా' అంటూ ఆమెని వెనక్కి పంపేసింది. విషయం తెలిసిన వెంగళరెడ్డి వెంటనే ఇంటికి వచ్చి పాతచీర లేకుంటే ఏమి, కొత్త చీరలు వున్నాయి గదా... అంటూ ఏకంగా పట్టుచీరనే తీసుకొని వచ్చి ఆ బిచ్చగత్తెకు దానంగా ఇచ్చాడట.

ఒకనాడు బుడ్డావెంగళరెడ్డి పనిబడి పక్కనున్న గ్రామానికి రాత్రి పూట వెళుతూ వుంటే దారిలో గొరక దొంగలు డబ్బు కోసం మారణాయుధాలతో దాడి చేసి చంపబోయారట. అప్పుడు వెంగళరెడ్డి ఏమాత్రం భయపడకుండా, చెరగని చిరునవ్వుతో దొంగతనం ఎంత తప్పో వారికి వివరించి చెప్పాడట. తాము చంపబోయింది దానకర్ణుడైన బుడ్డా వెంగళరెడ్డినని తెలిసి వాళ్ళు చాలా బాధపడ్డారట. వెంగళరెడ్డి వాళ్ళతో మీ ముఖాలు చూస్తుంటే ఎన్నాళ్ళ నుండో తిండికి ముఖం వాచిపోయినట్లు తెలుస్తోంది. ముందు కడుపు నిండా అన్నం తిందురు రాండి' అంటూ వాళ్ళని ఇంటికి తీసుకొని పోయి కడుపు నిండా భోజనం పెట్టించి " పాపం... ఇళ్ళ దగ్గర మీ పెళ్ళాం బిడ్డలు ఆకలితో ఎంత బాధ పడతా వున్నారో.. ఏమో"


Masterkranthi

అంటూ తలా ఒక బియ్యం మూట, దారి ఖర్చుల కోసం కొంచెం డబ్బులు ఇచ్చి పంపించాడట. దాంతో మరలా వాళ్ళు ఎప్పుడూ దొంగతనాల జోలికి వెళ్ళలేదట.

ఇలా జానపద గాథలలో వెంగళరెడ్డి ధాతృత్వం, మంచితనం గురించి అనేక గాథలు ప్రచారంలో వున్నాయి. కానీ ఇవన్నీ ఒక ఎత్తయితే ధాత కరువులో అతడు చేసిన దానధర్మాలు మరో ఎత్తు. అతన్ని మహోన్నతుడిగా నిలబెట్టింది ఆ సంఘటననే..

కర్నూలు ప్రాంతానికి కరవు తాకిడి మామూలే. పూర్తిగా వర్షాధారమైన ఈ ప్రాంతం ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారయినా కరవు బారిన పడేది. 1876 ప్రాంతంలో వచ్చిన ధాతు కరవు అత్యంత భయంకరమైంది. మనుషులు తిండి లేక చిక్కిపోయి చర్మం ఒంటికి అతుక్కుపోయి, డొక్కలు కనబడటంతో దీనిని డొక్కల కరవు అని పేరు వచ్చింది. ఆకలికి తట్టుకోలేక చెట్ల బెరళ్ళు, వేర్లనే కాక, మెత్తని జల్లెడ పట్టిన నల్లరేగడి మన్నును గూడా ప్రజలు తిన్నారు. పశువులు గడ్డి లేక తుడిచిపెట్టుకుపోయాయి. జనం వలసలబాట పట్టారు. తిండి లేక, పని లేక సతమతమయ్యారు. రోడ్లకిరువైపులా ఎక్కడ చూసినా శవాలే. పట్టించుకొనే వారే లేరు. దాదాపు 40 శాతం మంది ప్రజలు ఈ కరవులో మరణించినట్లు తెలుస్తూ వుంది. దాంతో ప్రభుత్వం ఫ్యామిన్ కమీషన్ ఏర్పాటు చేసింది. సాగునీటి పారుదల ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలని నిశ్చయించుకొంది. మిషనరీలు అనేక చోట్ల పనులు కల్పించి, గంజికేంద్రాలు తెరచి ప్రజలను ఆదుకున్నాయి. ఈ సమయంలో ప్రజల కోసం తన సర్వస్వం ధారపోసి తన చేతనైనంత వరకు ఆదుకొని అందరిచే కొనియాడబడిన వ్యక్తి బుడ్డావెంగళరెడ్డి.

తన దగ్గరున్న 12 పాతర్ల ధాన్యం ఖర్చు చేసి కరువు పోయి వానలు పడేదాకా దాదాపు మూడు నెలలు పేద ప్రజలకు అన్నదానం చేశాడు. దీని కోసం తన దగ్గరున్న ధనమంతా ఖర్చు పెట్టడమే గాక స్నేహితుల దగ్గర కూడా అప్పు తెచ్చాడు. బనగానపల్లెకు వచ్చిన కలెక్టరు ఈ విషయం తెలిసి బుడ్డావెంగళరెడ్డి గారి ధాతృత్వాన్ని స్వయంగా చూసి కదిలిపోయి విషయం గవర్నరుకు చేరవేశాడు. అతను విక్టోరియా రాణికి విషయం తెలిపి ఆమె అనుమతితో వెంగళరెడ్డి ధాతృత్వాన్ని ప్రశంసిస్తూ ఇరవై తులాల బరువున్న బంగారు పతకాన్ని బహూకరించి సత్కరించారు.

అందులో ముందువైపు ఆంగ్లంలోనూ, వెనుకవైపు తెలుగులోనూ వెంగళరెడ్డి గొప్పతనం చెక్కించబడింది. తెలుగులో ఏమున్నదంటే '1866 సంవత్సరములో సంభవించిన క్షామకాలమందు నిరాధారముగా వుండిన మన స్వదేశస్థుల పట్ల జరిగించిన వుత్కృష్ఠమైన ఔదార్యమునకు గాను హర్‌మెజస్టీ రాణి గారి వల్ల చేయబడిన శ్రేష్ఠమైన గణ్యతకు ఆనవాలుగా బుడ్డావెంగళరెడ్డి గారికి బహుమానము యివ్వబడినది" అని.

1900 సంవత్సరం డిసెంబర్ 31న వెంగళరెడ్డి గారు స్వర్గస్తులైనా ఈ ప్రాంత ప్రజల్లో అతని పేరు మాత్రం దానకర్ణునికి మరో రూపంగా శాశ్వతంగా నిలచిపోయింది.

పెండేకల్ అట్లూరెడ్డి లక్ష్మమ్మ

అభం శుభం తెలియని ఎనిమిది సంవత్సరాల చిన్న వయస్సులోనే పెళ్ళి జరిగి, పది సంవత్సరాల వయసులోనే భర్తంటే ఏమిటో... దాంపత్యమంటే ఏమిటో ఎరుగని స్థితిలోనే భర్తను కోల్పోయి బాల వితంతువుగా మారిపోయింది అట్లూరెడ్డి లక్ష్మమ్మ. తన దుస్థితికి ఎవరూ బాధపడకపోగా, తననే ఈసడించుకుంటుంటే ఎటుపోవాలో, ఏమి చేయాలో తెలియక తల్లడిల్లిపోయింది. అన్న ఇంటిలో ఆశ్రయం పొందినా ఏం చేయాలో పాలుపోలేదు. అటువంటి దీనస్థితిలో ఒకసారి మహాత్మాగాంధీ దర్శనం ఆమెకు కలిగింది. పూజ్యబాపూజీకి తన కథనంతా వివరించి దారి చూపించమంది. మహాత్ముడు ఆమెకు ధైర్యం నూరిపోసి ఆత్మ విశ్వాసాన్ని రగిలింపజేశాడు. పదిమందికి సేవ చేయడంలో వుండే ఆనందాన్ని, తృప్తినీ ఆమెకు అర్థమయ్యేలా వివరించాడు. ఆ రోజుతో ఆమెలో ఒక కొత్తశక్తి అంకురించింది. నూతనోత్తేజంతో జరిగిన దాన్ని వదిలేసి కొత్తజీవితాన్ని మొదలుపెట్టింది.

పత్తికొండ తాలుకాలోని పెండేకల్లులో 1878లో జన్మించిన లక్ష్మమ్మ ఒక హాస్టలు ప్రారంభించింది. అనాథలకు, నిరుపేదలకు, వృద్ధులకు, విధివంచితులైన యువతులకు ఆశ్రయం కల్పించసాగింది. అనేకమంది జీవితాల్లో వెలుగులు నింపుతూ, వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తూ, పిల్లలను పాఠశాలల్లో చదివిస్తూ వారికొక దారి చూపించసాగింది. ఈ హాస్టల్లో చదివిన అనేకమంది ఆ తర్వాత కాలంలో జీవితంలో నిలదొక్కుకొని పెద్దపెద్ద ఉద్యోగాల్లో స్థిరపడి మరింత మందికి సేవ చేయసాగారు.

1932లో ఏర్పడిన ఆ హాస్టలు గురించి పత్తికొండ ప్రాంతంలో తెలియని వారు ఎవరూ లేరు. అనేక మంది ఈమె సేవా జీవితాన్ని గమనించి తమకు చేతనైనంత సహాయం అందిస్తూ హాస్టలు నిరాటంకంగా కొనసాగేందుకు తోడ్పడ్డారు. ఎంతటి పెద్ద



డా॥ ఎం. హరి కిషన్

నాయకులనైనా "ఏరా బాగున్నావా" అంటూ ఆమె ఆప్యాయంగా పలకరించేది. ఆమె పెద్దరికాన్ని మన్నించి ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికార్లు అందరూ ఆమెకు పాదాభివందనం చేసి ఆశీర్వాదం అందుకునేవారు. బ్రిటిష్ ప్రభుత్వం ఈమె సేవను గమనించి రావ్‌బహుదూర్ బిరుదును అప్పట్లోనే ఆమెకు ప్రదానం చేసింది.

104 సంవత్సరాలు జీవించిన లక్ష్మమ్మ ఎందరికో మార్గదర్శకులయ్యారు. 1982లో స్వర్గస్తురాలైన ఆమె భౌతికకాయాన్ని చుట్టుపక్కల గ్రామాల్లోని ప్రజానీకమంతా దర్శించుకొని కన్నీటితో వీడ్కోలు పలికారు.

నిస్వార్థసేవకు, జీవిత పరమార్థానికి అర్థం చెప్పిన ఇటువంటివారు సమాజంలో చాలా అరుదుగా కనిపిస్తుంటారు. వీరి జీవితం అనేకమందికి ప్రేరణగా నిలచి ఆత్మస్థైర్యాన్ని కలుగజేస్తుంది. ఎటువంటి ఆపదలు ఎదురైనా నిలదొక్కుకొని పోరాటం చేసే శక్తిని అందిస్తుంది.



పత్తికొండ ఊరి వాకిలి

గాడిచెర్ల హరి సర్వోత్తమరావు

కర్నూలు జిల్లాలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రదేశంలో తొలి రాజకీయ ఖైదీ, పత్రికా సంపాదకుడు, బహుభాషావేత్త, గ్రంథాలయ వయోజన విద్యల వ్యాప్తికి జీవితాంతం కృషి చేసిన వ్యక్తి, స్వార్థమెరుగని తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు గాడిచెర్ల హరిసర్వోత్తమరావు.

మన ప్రాంతానికి రాయలసీమ అనే పేరు వ్యాప్తిలోనికి రావడానికి కారణం గాడిచెర్ల వారే. దత్త మండలాలు అనే పేరు బానిసత్వానికి చిహ్నంగా వుందని, ఈ ప్రాంత ప్రజల ఆత్మగౌరవాన్ని పెంచే విధంగా రాయలు ఏలిన సీమ కాబట్టి దీనికి రాయలసీమ అని పేరు పెట్టాలని 1928 లో సర్వేపల్లి రాధాకృష్ణ అధ్యక్షతలో నంద్యాలలో జరిగిన ఆంధ్ర మహాసభలో ప్రతిపాదించాడు. అప్పటి నుంచీ ఈ ప్రాంతాన్ని రాయలసీమ అనే పేరుతో పిలవడం మొదలై అది బహుళ వ్యాప్తి చెంది ఆఖరికి స్థిరపడింది.

గాడిచెర్లవారు 1883 సెప్టెంబర్ 14వ తేదీన భగీరథమ్మ, శ్రీ వెంకటరావు దంపతులకు కర్నూలులో జన్మించారు. వీరి తండ్రి రెవెన్యూ ఇన్‌స్పెక్టరుగా పని చేసేవారు. గాడిచెర్ల వారు కంభంలో ప్రాథమిక విద్యను, కర్నూలు మున్సిపల్ హైస్కూల్ మరియు గుంతకల్లులో హైస్కూల్ చదువును పూర్తి చేశారు. మద్రాస్ కళాశాలలో బి.ఎ., ఎం.ఎ. పూర్తి చేశారు. 1907 లో వీరు రాజమండ్రిలోని టీచర్ ట్రైనింగ్ కళాశాలలో చదువుతుండగా స్వరాజ్య ఉద్యమంలోకి ప్రవేశించారు.

బ్రిటిష్ ప్రభుత్వం హిందూముస్లింల మధ్య గొడవలు పెంచి విభజించి పాలించే కుట్రలో భాగంగా పశ్చిమ బెంగాల్‌ను రెండు ముక్కలుగా విడదీసింది. కానీ దానిని వ్యతిరేకిస్తూ దేశమంతా 'వందేమాతరం' ఉద్యమం ప్రారంభమైంది. బిపిన్ చంద్రపాల్ దేశమంతా పర్యటిస్తూ ఆంధ్రదేశంలో అడుగు పెట్టాడు. ఆ సమయంలో రాజమండ్రి కళాశాలలో చదువుతున్న గాడిచెర్ల ఆ ఉపన్యాసాలతో ప్రభావితుడై విద్యార్థులకు నాయకత్వం వహించారు. తరువాత రోజు కళాశాల విద్యార్థులందరూ నల్లబ్యాడ్జీలు ధరించి వందేమాతర నినాదాలతో కళాశాలకు వచ్చారు. అక్కడి ప్రిన్సిపల్ హంటర్ బ్యాడ్జీలు తీసి వేస్తే తప్ప లోపలికి అడుగు పెట్టనీయనన్నాడు. కానీ గాడిచెర్ల నాయకత్వంలో విద్యార్థులు దానిని నిరాకరిస్తూ ప్రదర్శన జరిపారు. దానితో ప్రిన్సిపల్ గాడిచెర్లను కళాశాల నుండి బహిష్కరించాడు. అంతేగాక ప్రభుత్వం ఆయనకు ఎక్కడా ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వరాదని ఉత్తర్వులు జారీ చేసింది.

గాడిచెర్లవారు ఆ తర్వాత స్వరాజ్య పత్రికలో సంపాదకునిగా చేరారు. పత్రికారంగంలో ఎడిటర్, ఎడిటోరియల్ అనే ఆంగ్ల పదాలకు తొలిసారిగా సంపాదకుడు, సంపాదకీయం అనే పేర్లను పెట్టింది వీరే. స్వరాజ్య పత్రికలో పని చేస్తున్న సమయంలోనే బ్రిటిష్ అధికారి 'ఏష్' హత్య జరిగింది. దాంతో సామాన్య


Masterkranthi.R
2016

ప్రజలపై బ్రిటీష్ సైనికుల నిర్బంధం, దమనకాండ, తీవ్రతరం అయింది. దానిని ఎండగడుతూ, గాడిచెర్లవారు "విపరీతబుద్ధి' అనే పేరుతో సంపాదకీయం రాశారు. దాంతో ప్రభుత్వం అతనిని రాజద్రోహం నేరం క్రింద అరెస్టు చేసి మూడు సంవత్సరాల జైలుశిక్ష విధించింది. అలా ఖైదు కాబడిన తొలి రాజకీయ ఖైదీ వీరే. అంతేగాక అదేరోజు తిలక్ "స్వాతంత్ర్యం నా జన్మహక్కు" అని నినదిస్తూ అరెస్టు కాబడ్డారు. అందుకే వీరిని 'ఆంధ్రా తిలక్' అని గూడా పిలుస్తుంటారు.

రాయవేలూరు జైలులో గాడిచెర్ల వారు అనేక బాధలు అనుభవించారు. కాలికి, మెడకు సంకెళ్ళు వేసి వాటి మధ్య ఒక కొయ్యముక్క తగిలించారు. పురుగుల అన్నం పడుకోడానికి చినిగిపోయిన చాప, కట్టుకోడానికి రెండు చిన్న బట్ట ముక్కలు మాత్రమే ఇచ్చారు. నూనె గానుగను నిరంతరం తిప్పించేవారు. కానీ ఎన్ని బాధలు పడినా వారిలో పోరాట పటిమ మాత్రం కొంచెం గూడా తగ్గలేదు.

1913 లో జైలు నుండి విడుదల కాగానే కాశీనాథుని నాగేశ్వరరావుగారి ఆంధ్రపత్రికకు కొంతకాలం సంపాదకునిగా పనిచేసి, 1916 లో హోంరూల్ ఉద్యమంలో పాల్గొన్నాడు. 1920 లో గాంధీగారు ప్రారంభించిన సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొని వారి వెంట ఆంధ్రదేశమంతా పర్యటించి గాంధీగారి ఉపన్యాసాలను తెలుగులోకి అనువదించాడు. తెలుగు, ఇంగ్లీషు, హిందీ, కన్నడ, మరాఠీ, తమిళ భాషలలో అనర్గళంగా మాట్లాడే వారు. "ది నేషనలిస్ట్" అనే ఆంగ్ల పత్రికను కొంతకాలం నడిపారు. కానీ ప్రభుత్వం దానిని నిషేధించింది. తాడిపత్రిలో 'మాతృసేవ' పత్రిక స్థాపనకు కృషి చేశారు. తరువాత నంద్యాలలో 'కౌమోదకి' పత్రికను స్థాపించారు.

1927 లో వీరు ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ నిర్ణయం మేరకు మద్రాస్ కౌన్సిల్ ఎన్నికల్లో పాల్గొని జస్టిస్ పార్టీ అభ్యర్థిని ఓడించి, కర్నూలు నుంచి ఎన్నికైన తొలి యం.యల్.హెచ్. గా గుర్తింపు పొందారు. 1937 లో రాయలసీమ, ఆంధ్ర ప్రాంత నాయకుల మధ్య సఖ్యత చేకూర్చి 'శ్రీభాగ్' ఒప్పందం ఏర్పాటు చేసుకోవడంలో కీలకపాత్ర పోషించాడు.

1930 తర్వాత వీరు క్రమక్రమంగా రాజకీయాలకు దూరంగా జరుగుతూ గ్రంథాలయ, వయోజన ఉద్యమాలకి ఎంతగానో కృషి చేశారు. 1934 నుండి జీవితాంతం వీరు గ్రంథాలయ సంఘానికి అధ్యక్షునిగా పనిచేశారు. వయోజన విద్య డైరెక్టరుగా ఆంధ్రదేశమంతా పర్యటిస్తూ ప్రజలను అక్షరాస్యులుగా మార్చడం కోసం ఎంతగానో కృషి చేశాడు. అనేక గ్రామాల్లో గ్రంథాలయాలు ఏర్పడడానికి కారణం అయ్యారు.

కొమర్రాజు లక్ష్మణరావుగారు ప్రారంభించిన విజ్ఞాన చంద్రిక గ్రంథమండలి కార్యదర్శిగా వుంటూ సంస్థ మొదటి గ్రంథం 'అబ్రహం లింకన్ జీవిత చరిత్ర' రచించారు. గ్రీస్ దేశ చరిత్ర, విస్మృత కవి సార్వభౌముడు, శ్రీరామచరిత్ర వ్యాఖ్యానం లాంటి పుస్తకాలు రాయడమే గాక, రాజకీయ ఆర్థిక సామాజిక విషయాలకు సంబంధించి వందలాది వ్యాసాలు రచించి ప్రజలను చైతన్యపరిచారు.

గాడిచెర్ల వారు విశ్రాంతి యెరుగని వీరుడు. నిరంతరం ప్రజల కోసం పని చేస్తూ, ప్రజల్లోనే గడుపుతూ అనారోగ్యానికి గురయి చివరికి 1960 ఫిబ్రవరి 29న దేశమాత సేవలోనే తుదిశ్వాస విడిచారు. ఇతడు గ్రంథాలయోద్యమానికి చేసిన సేవకు గుర్తుగా మన జిల్లాలోని కేంద్ర గ్రంథాలయ నూతన భవనానికి 'గాడిచెర్ల హరి సర్వోత్తమరావు భవనం' గా పేరు పెట్టి వారిని స్మరించుకుంటూ వున్నాము.


కాదర్‌బాద్ నరసింగరావు

నంద్యాల ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు, అపరగాంధీ బిరుదాంకితుడు, నంద్యాల పట్టణాన్ని తీర్చిదిద్దిన మహనీయుడు కాదర్‌బాద్ నరసింగరావు గారు. వీరు 1888లో నంద్యాలలో ప్రఖ్యాతి చెందిన న్యాయవాది వెంకటసుబ్బారావు, నరసమ్మ గార్లకు అక్కడే జన్మించారు.

మహాత్మాగాంధీ నాయకత్వంలో జరుగుతున్న స్వాతంత్ర్య ఉద్యమం పట్ల ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరి బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా జరిగే అన్ని పోరాటాలలో పాల్గొంటూ నంద్యాల పట్టణ ప్రజల్లో దేశభక్తిని, జాతీయ సమైక్యతా భావాన్ని పెంచడానికి ఎంతగానో శ్రమించారు. 1935 నుండి 36 వరకు నంద్యాల కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్‌గా ఏకఛత్రాధిపత్యం వహించారు.

1920 నుంచి 1934 వరకు నంద్యాల మునిసిపాలిటీకి చైర్మన్‌గా పని చేసిన వీరు ఆ కాలంలో నంద్యాలను పారిశ్రామికంగా, విద్యా విషయకంగా, వాణిజ్యకేంద్రంగా తీర్చిదిద్దారు. సమాజ పురోగమనానికి విద్యే ప్రధానమని భావించిన వీరు నంద్యాలలో విద్యా వ్యాప్తి కోసం తన నాలుగెకరాల వ్యవసాయభూమిని ఉచితంగా ఇచ్చి1916 – 17 న ఆరవ తరగతితో ప్రారంభించి 1921 – 22 న ఎస్.ఎస్.ఎల్.సి. వరకు తీసుకు వచ్చారు. మునిసిపల్ హైస్కూల్‌ను నిర్మించేలా చేశారు. దానితో చదువుల కోసం విద్యార్థులు చిన్నతనంలోనే వేరే ప్రాంతాలకు పోయే బాధ తప్పింది. అనేక మంది విద్య పట్ల ఆకర్షితులు కావడం జరిగింది. పూరిపాకలో ప్రారంభమైన ఆ పాఠశాల తరువాత రేకుల షెడ్లు, పటిష్టమైన భవనాల్లోకి నరసింగరావు గారు పురపాలక సంఘ అధ్యక్షులుగా వున్న సమయంలోనే శరవేగంగా పూర్తయింది. ఉత్తమమైన ఉపాధ్యాయులను వెదికి తీసుకొని వచ్చి మంచి నాణ్యమైన విద్యను పట్టణ వాసులకు అందేలా చూశారు. ఇక్కడ చదువుకొన్న విద్యార్థులు అనేక మంది దేశవిదేశాల్లో ఉన్నత స్థానాలు సంపాదించి నంద్యాల కీర్తిని జగద్విదితం చేయగలిగారు.ఆ పాఠశాల ఆట మైదానం కూడా వీరు విరాళంగా ఇచ్చినదే.

కులమతాలకతీతంగా సమాజశ్రేయస్సును కాంక్షిస్తూ, కులవివక్షను నిరసిస్తూ అందరూ సమానమే అని చాటుతూ హరిజనుల కోసం 1940లో ఆత్మకూరు గ్రామంలో ఒక హాస్టల్‌ను ప్రారంభించారు. అనేక మంది చేస్తున్న విమర్శలను ధైర్యంగా ఎదుర్కొని ఆ హాస్టలును విజయవంతంగా



డా॥ ఎం. హరి కిషన్

నడిపారు. ఆ తరువాత 1947లో హరిజన బాలుర కోసం, 1952లో హరిజన బాలికల కోసం హాస్టళ్ళు నిర్మించేలా కృషి చేశారు. నంద్యాలలో విరాళాన్ని ఇవ్వడమే గాక అనేక మందితో విరాళాలు ఇప్పించేవారు. నంద్యాల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎంతో కాలం బాధ్యతలు నిర్వర్తించిన వీరు స్వాతంత్ర్యోద్యమకాలంలో గాడిచెర్ల హరిసర్వోత్తమరావు గారితో కలిసి, వారి సలహాలు, సూచనలు స్వీకరిస్తూ జాతీయోద్యమంలో క్విట్ ఇండియా, వ్యక్తి సత్యాగ్రహం మొదలగునవన్నీ విజయవంతంగా జరగడానికి కృషి చేశారు.

స్వాతంత్ర్యానంతరం 1952లో ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నంద్యాల పట్టణం సందర్శించినపుడు రైల్వేస్టేషన్ సమీపంలో ఒక భారీ బహిరంగసభను విజయవంతంగా నిర్వహించి అందరి అభినందనలనూ అందుకున్నారు. ఆనాటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ నంద్యాలకు విచ్చేసినపుడు వీరి క్రమశిక్షణ, సేవానిరతి, త్యాగతత్పరత చూసి ఎంతగానో అభినందించారు.

మహాత్మాగాంధీ సిద్ధాంతాలను ఎంతగానో ఆరాధించే నరసింగరావు నిరంతర కార్యశీలి. మాటలకన్నా చేతలు ముఖ్యమని నమ్మే ఆచరణవాది. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం ముఖ్యమంత్రిగా వున్న సమయంలో కరువుకు గుర్రై రైతులు పన్నులు చెల్లించలేని స్థితికి లోనయ్యారు. దాంతో ముఖ్యమంత్రితో మాట్లాడి పది ఎకరాల వరకు శిస్తు చెల్లించవలసిన అవసరం లేదని వుత్తర్వులు వెలువరించేలా చేశారు. వీరు ఖద్దరు బట్టలు ధరిస్తూ, పేదవారిపట్ల ప్రేమవాత్సల్యాలను ప్రదర్శిస్తూ, హరిజనులతో కలసి సహపంక్తి భోజనాలు గావిస్తూ, వారిని సమాజంలో ఒక భాగంగా మారుస్తూ, ఎందరికో మార్గదర్శకులైనారు. అందుకే నంద్యాల ప్రాంత ప్రజలు వీరిని 'అపరగాంధీ'గా అభిమానించి పిలిచేవారు.

కోస్తా, రాయలసీమ ప్రజల మధ్య 1937 లో ఏర్పడిన శ్రీభాగ్ ఒడంబడికపై కర్నూలు ప్రాంతం నుంచి సంతకం చేసిన వారిలో కాదర్‌బాద్ నరసింగరావు గారు కూడా వున్నారు. వీరు గాడిచెర్ల, కల్లూరు సుబ్బారావు గార్లతో కలిసి నంద్యాల ప్రాంతమంతా శ్రీభాగ్ ఒప్పందం గురించి వివరించడం జరిగింది. నంద్యాల ప్రాంతంలో అనేక మంది వీరిని రాజకీయ గురువుగా భావించేవారు. ప్రధానమంత్రులు మొదలు సామాన్య కార్యకర్తల వరకు అందరూ వీరి ఆతిథ్యం స్వీకరించినవారే.

1963 జూన్ రెండవ తేదీన స్వర్గస్తులైన వీరు నంద్యాల ప్రాంత ప్రజలలో తమ విశిష్ట వ్యక్తిత్వం ద్వారా ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. అందుకే అక్కడి ప్రజలు, మునిసిపల్ హైస్కూల్‌లో చదివిన పూర్వవిద్యార్థులు వారి గౌరవార్థం పాఠశాల ఆవరణలో 1983న నరసింగరావుగారి శిలా విగ్రహాన్ని శ్రీపెండేకంటి వెంకటసుబ్బయ్యగారి చేతుల మీదుగా ప్రతిష్ఠింప చేయడమే గాక మున్సిపల్ హైస్కూల్‌కు 2005 లో కాదర్‌బాద్ నరసింగరావు మెమోరియల్ మున్సిపల్ హైస్కూల్‌గా నామకరణం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

మేడం వెంకయ్యశెట్టి

మహాత్మాగాంధీ స్వరాజ్యనిధికి చందాలు సేకరించడం కోసం ఆంధ్రదేశమంతా పర్యటిస్తూ మొట్టమొదటి సారిగా 1921లో కర్నూలు నగరంలో అడుగుపెట్టారు. పోలీసులు ఎటువంటి బందోబస్తు చేయకపోయినా రైల్వే స్టేషన్ నుండి మేడం వెంకయ్య శెట్టి ఇంటివరకు పదిగజాల కొక వాలంటీరును ఏర్పాటు చేసి, ప్రజలను నియంత్రిస్తూ, నగరమంతా స్వాగత తోరణాలతో నింపి తుంగభద్ర ఇసుక తిన్నెలపై భారీ బహిరంగసభను ఏర్పాటు చేసి, ఎక్కడా చిన్న అపశృతి దొర్లకుండాఆ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించి, అందరి చేత ప్రశంసలు అందుకున్న వ్యక్తి మేడం వెంకయ్య శెట్టి. మహాత్మాగాంధీ వీరి నివాసగృహంలో కాసేపు విశ్రమించి అల్పాహారం తీసుకొని బహిరంగసభకు వెళ్ళడం జరిగింది. మేడం వెంకయ్యశెట్టి ఆ కాలంలోనే స్వరాజ్య నిధికి వెయ్యిన్నూటా పదహార్లు ఒక్కరే చందా ఇచ్చి తన దేశభక్తిని చాటుకోవడం జరిగింది.

వీరు 1893 మే 31న కర్నూలు నగరంలో జన్మించారు. వీరి తల్లిదండ్రులు సుబ్బయ్యశెట్టి, రామక్కమ్మ. వీరు పెద్ద భూస్వాములు. చుట్టుపక్కల గ్రామాలలో అనేక భూములు వీరి ఆధీనంలో వుండేవి. నందికొట్కూరు, కోడుమూరు గ్రామాలలో జిన్నింగు మిల్లులు, నూనెమిల్లులు నడుపుతుండేవారు.

మహాత్మాగాంధీ పిలుపు మేరకు భారతదేశంలో స్వదేశీపాలన కోసం విదేశీయులను పారద్రోలడం కోసం స్వాతంత్ర్య సమరంలోకి చురుగ్గా అడుగుపెట్టారు. 1920 నుండి 1940 వరకు కర్నూలు పరిసర ప్రాంతాలలో జరిగిన అన్ని ఉద్యమాలను సమర్థవంతంగా నడిపించారు. నాయకంటి శంకరరెడ్డి, బియాబానీ వంటి ప్రముఖులతో కలసి, ఆర్థికంగా సహకారం అందిస్తూ జాతీయోద్యమానికి చేయూతను అందించారు.

మహాత్మాగాంధీ ఆదేశాలను అమలుపరుస్తూ నిత్యం ఖద్దరు ధరిస్తూ, హరిజనులను ఆదుకుంటూ, నిరాడంబరంగా జీవిస్తూ, కల్లు దుకాణాలను వ్యతిరేకిస్తూ, మద్యపాన నిషేధాన్ని చాటి చెబుతూ వాటి ఎదుట నిరసన ప్రదర్శనలు నిర్వహించేవారు. క్విట్ఇండియా ఉద్యమాలు, వ్యక్తి సత్యాగ్రహ సమయంలో చురుగ్గా పాల్గొన్నారు.సమర్థవంతంగా నడిపించారు.


Masterkranthi.R
2015

మహాత్మాగాంధీ పిలుపు మేరకు మద్యపాన నిషేధాన్ని అమలు చేయడం కోసం కర్నూలులోని పెద్ద పడఖానా, బుధవారపేట, జొహరాపురం ప్రాంతాలలోని కల్లు దుకాణాల ముందు ఎన్.శంకరరెడ్డితో కలసి పెద్ద ఎత్తున పికెటింగులు జరిపారు. కొందరు మేడం వెంకయ్య శెట్టి తమను తాగినందుకు కొట్టాడంటూ తప్పుడు కేసు పెట్టారు. వెంకయ్య శెట్టి ఖద్దరుధరించి కోర్టుకు బైలు దేరినప్పుడల్లా ప్రజలు గుంపులుగుంపులుగా జయజయధ్వానాలు పలుకుతూ కోర్టువరకూ ఊరేగింపుగా వచ్చేవారు. వ్యాపారస్తులు తమ దుకాణాలన్నీ మూసివేసి మద్దతు ప్రకటించేవారు. ఈ మద్యపాన నిషేధ ఉద్యమం కర్నూలు ప్రాంతంలో జాతీయోద్యమానికి ఊపిరి పోసి ప్రజలను ఒక్కతాటిమీదకు తీసుకు రావడానికి దోహదపడింది.

వీరు మేడంవారి సత్రం స్థాపించి వివిధ పుణ్యక్షేత్రాలకు వెళ్ళే యాత్రికులకు ఉచిత భోజన వసతిని ఏర్పరిచారు. సత్రం చుట్టూ దేవాలయాలు నిర్మించి పూజారులకు వసతి గృహాలు నిర్మించి ఇచ్చారు. సత్రం ఆవరణలో కళ్యాణ మండపాన్ని నిర్మించి నిరుపేదలకు మంగళసూత్రాలు అందిస్తూ వివాహాలు జరిపించేవారు. కరువులు ఏర్పడిన సమయంలో జొన్నలు, కొర్రలులాంటి ఆహారధాన్యాలు తెప్పించి పేదలకు ఉచితంగా అందించేవారు. కర్నూలులో గోరక్షణశాలను నిర్మించి దానికి ధర్మకర్తగా వ్యవహరించారు. మించిన్‌బజార్‌లోని పెద్దమ్మవారిశాలకు అధ్యక్షులుగా పని చేశారు.

అప్పట్లో వీరివద్ద ఒక 'స్టడీబేకర్' వ్యాను వుండేది. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో ప్రభుత్వ అభ్యర్థన మేరకు మిలటరీ వారికి ఈ వ్యానును ఉచితంగా ఇచ్చివేశారు. ఒక పక్క వ్యాపారాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, మరో పక్క సమాజసేవను విస్తృతంగా నిర్వహించేవారు.

1930 లో బనగానపల్లెలో కట్టించిన ప్రభుత్వ వైద్యశాలకు, కర్నూలులోని సైంట్ జోసెఫ్ హాస్పిటల్ నిర్మాణానికి తనవంతు సహకారం అందించారు. వీరు చేసిన గుప్త దానాలకు లెక్కేలేదు. 1940 తరువాత క్రియాశీల రాజకీయాలనుంచి తప్పుకొని స్వచ్ఛంద సంస్థలతో కలసి సమాజ శ్రేయస్సుకు చివరివరకు కృషిచేశారు.

1953 జనవరి 31వ తేదీన స్వర్గస్థులైన వీరు ఆగర్భశ్రీమంతులైనప్పటికీ తమ విశిష్ట వ్యక్తిత్వం చేత, స్వాతంత్ర్య సమరంలో పాల్గొని కర్నూలు ప్రజలకు దీపధారిగా ఉండడం చేత, మహాత్మాగాంధీ అడుగుపెట్టిన వేళ ఆ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడం చేత అందరి మనస్సులో శాశ్వత స్థానం సంపాదించుకున్నారు.

బియాబానీ


స్వాతంత్ర్యానికి పూర్వం డిప్యూటీ కలెక్టర్‌గా వచ్చిన అవకాశాన్ని తృణప్రాయంగా వదిలివేసి ఆంగ్లేయుల వద్ద బానిసగా పనిచేయను అని ఘంటాపథంగా ప్రకటించిన నిష్కళంక దేశభక్తుడు బియాబానీ. పదవుల కోసం సొంత అన్నదమ్ములు, బంధువులే ఒకరి వెనుక ఒకరు గోతులు తీసుకుంటూ, అందరి కాళ్ళు పట్టుకుంటూ పైకెదగాలని ప్రయత్నిస్తున్న కాలంలో స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఇవ్వజూపిన రాజ్యసభ సభ్యత్వాన్ని సున్నితంగా తిరస్కరించిన మహానుభావుడు నిజమైన ప్రజాసేవకుడు బియాబానీ.

వీరి పూర్తిపేరు సయ్యద్‌షా మొహియుద్దీన్ ఖాద్రి బియాబానీ. వీరు 1894లో ఆనాటి కర్నూలు జిల్లాలోని కంభంలో గొప్ప జాగిర్దారీ వంశంలో జన్మించారు. పాఠశాల విద్యను కంభంలోనే పూర్తి చేసుకొని మద్రాసు ప్రెసిడెన్సీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి స్వర్ణపతకాన్ని సంపాదించారు. దానితో వీరిని కర్నూలు నగర వీధులలో మేళతాళాలతో వూరేగించి సన్మానించారట.

అలీఘడ్ విశ్వవిద్యాలయంలో ఎల్.ఎల్.బి పట్టా పొందిన వీరి ప్రతిభను గుర్తించిన ఆంగ్లేయ ప్రభుత్వం డిప్యూటీ కలెక్టర్‌గా నియామకపు ఉత్తర్వులు పంపించారు. మహాత్మాగాంధీ అనుచరులైన బియాబానీ ఆంగ్లేయుల వద్ద బానిసగా పని చేయడానికి ఏ మాత్రమూ ఇష్టపడలేదు. ఆత్మాభిమానాన్ని చంపుకొని పరాయిపాలకుల వద్ద పని చేయడం కన్నా స్వాతంత్ర్య సమరంలో పాల్గొని దేశం కోసం సర్వం త్యాగం చేయడమే మిన్నగా భావించి అంత పెద్ద ఉద్యోగాన్ని గడ్డిపోచతో సమానంగా చూసి తిరస్కరించారు.

మహాత్మాగాంధీ ఆశయాలను పాటిస్తూ, ఎల్లప్పుడూ ఖద్దరునే ధరిస్తూ, పేదప్రజల కోసం పాటు పడుతూ వుండేవారు. స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న కాంగ్రెస్ పార్టీ కోసం తనకున్న రెండు వందల ఎకరాలకు పైగా భూముల్ని విరాళంగా ఇచ్చివేసిన మహాదాత బియాబానీ. కర్నూలుజిల్లా చరిత్రలో ఇతనిలాగా విరాళం ఇచ్చిన వ్యక్తి బహుశా ఇంకెవరూ లేరేమో.

1923లో అఖిల భారత జాతీయ పతాక సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొన్నారు. క్విట్ ఇండియా ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించినందుకుగాను పదకొండు నెలలు కఠిన కారాగార శిక్షను



అనుభవించారు. జైలులో వీరికి అబ్దుల్ మౌలానా అజాద్‌తో పరిచయమైంది. తెలుగు, తమిళం, ఉర్దూ, కన్నడ, అరబిక్ భాషలతో మంచి పరిచయం వున్న బియాబానీ ఆ సమయంలో అజాద్‌కు అరబిక్‌భాష నుండి ఉర్దూభాషలోకి "తహిసీర్–ఎ–ఖురాన్" అనే పుస్తక అనువాదంలో ఎంతో సహకారం అందించారు.

తనకంటూ ఏమీ మిగుల్చుకోకుండా తనకున్నదల్లా అందరికీ సహాయార్థం దానం చేసిన నిస్వార్థజీవి బియాబానీ. వీరు స్వాతంత్ర్యానంతరం గూడా ఎటువంటి పదవులూ స్వీకరించలేదు. ఇతని మేధస్సు, దేశభక్తి, త్యాగనిరతుల గురించి బాగా తెలిసిన మౌలానా అజాద్‌గారు వీరిని రాజ్యసభకు ఎన్నిక చేయించి మంత్రి పదవిని యిప్పించాలని ప్రయత్నించారు. ఎవరైనా ఇది వింటే ఎగిరి గంతేసేవారేమో గానీ బియాబానీ మాత్రం సున్నితంగా వారి అభ్యర్థనను తిరస్కరించారు. పదవులకు, కీర్తి ప్రతిష్ఠలకు, సన్మానాలకు దూరంగా జీవించారు.

కర్నూలు రాష్ట్రరాజధానిగా వున్న సమయంలో మన తొలి రాష్ట్రపతి బాబూరాజేంద్రప్రసాద్ గారు కర్నూలుకు వచ్చారు. వచ్చీరాగానే "నేను బియాబానీ గారిని కలవాలి. వారి ఇల్లు ఎక్కడో కనుక్కోండి. వెళదాం" అన్నారట. దానికి అధికారులు "మీరు వెళ్ళడం ఎందుకు? అతనినే పిలుచుకొని వస్తాం" అన్నారట. రాష్ట్రపతి చిరునవ్వు నవ్వి "అలాగా... ప్రయత్నించండి" అన్నారట. అధికారులు వెళ్ళి కాసేపటికి ఉత్త చేతులతో, తలలు దించుకొని వచ్చారు. అది చూసి రాష్ట్రపతి చిరునవ్వు నవ్వి "ఆయన రారండి. మనమే వెళ్ళాలి" అంటూ అతని గొప్పతనాన్ని, ఆత్మాభిమానాన్ని వివరించి, తానే స్వయంగా వెళ్ళి బియాబానీ గారిని కలిసి పరామర్శించి వచ్చారట గానీ ఏ మాత్రం దానిని తలబిరుసుగా భావించలేదట. అంతేగాదు ఆంధ్రరాష్ట్ర అవతరణ సందర్భంగా కర్నూలుకు విచ్చేసిన ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ గారు కూడా బియాబానీ గారిని గుర్తుపెట్టుకొని పిలిచి పలకరించి కుశల ప్రశ్నలు వేశాడట. బియాబానీ వ్యక్తిత్వం అలా ప్రతి ఒక్కరినీ ఆకర్షించింది. ప్రభుత్వం స్వాతంత్ర్య సమరయోధునిగా గుర్తించి ఇచ్చిన పదహైదు ఎకరాల భూమిని బైర్లూటి ప్రాంతంలోని సిద్ధాపురం సెటిల్‌మెంట్‌లో తిరిగి ప్రభుత్వానికే ఉచితంగా ఇచ్చివేశారు.

1969లో హైదరాబాదులో స్వర్గస్తులైన వీరు నిష్కళంక దేశభక్తులు. సెక్యులర్ భావాలు గల జాతీయవాది. ఆశయాలు మాటల్లోనే గాక ఆచరణలో అందరికీ చూపించిన గొప్ప గాంధేయవాది. అంతేగాదు తనకున్న యావదాస్తినీ స్వాతంత్ర్యసమరంకోసం, పేదప్రజల కోసం ఖర్చుపెట్టిన మహాదాత.

ముచ్చుకోట వేంకటరామయ్య

కర్నూలు జిల్లాలో మొట్టమొదట పాఠకుల కోసం గ్రంథాలయాన్ని ప్రారంభించి దాదాపు యాభై సంవత్సరాల పాటు అవిశ్రాంతంగా నడిపిన వ్యక్తి, ప్రభుత్వ సహాయాన్ని ఏమాత్రం స్వీకరించకుండా తన స్వంత ధనాన్ని ఖర్చు పెడుతూ జిల్లాలో విద్యావ్యాప్తికి, జ్ఞానాభివృద్ధికి పాటుపడిన మహానుభావుడు ముచ్చుకోట వేంకటరామయ్యగారు.

కరణం వేంకటరాయుడు, మీనాక్షమ్మ దంపతులకు 1894 అక్టోబర్ 5న అనంతపురం జిల్లా తాడిపత్రి తాలుకాలోని ముచ్చుకోట గ్రామంలో వేంకటరామయ్యగారు జన్మించారు. వీరి ప్రాథమిక విద్య ఆమళ్ళదిన్నె పాఠశాలలోనూ, మాధ్యమిక విద్య గుత్తిలోనూ జరుగగా, హైస్కూల్ విద్య కర్నూలులోని కోల్స్ పాఠశాలలో పూర్తయింది. ఇంటర్, ఉపాధ్యాయ శిక్షణలను మద్రాసులో పూర్తి చేశారు. ఆ తరువాత తాను చదువుకున్న కోల్స్ హైస్కూల్లోనే ఉపాధ్యాయునిగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు.

స్వాతంత్ర్యోద్యమంలో గ్రంథాలయ ఉద్యమం కూడా ఒక భాగం. ప్రజలను అక్షరాస్యులుగా మారుస్తూ, విజ్ఞానాన్ని అభివృద్ధి చేయడం ద్వారా వారిలో ఆధునిక భావాలు వ్యాప్తి చెంది, స్వాతంత్ర్యకాంక్ష బలపడి, ఉద్యమం రూపొందుకోవడానికి గ్రంథాలయాలు ఎంతగానో తోడ్పడ్డాయి. వేంకటరామయ్య గారు ముచ్చుకోటలో వున్నప్పుడు దాని మజరా గ్రామమైన వరదాయపల్లెలో నడుపబడుతున్న సాధుజన సమాజమనే ఒక చిన్న గ్రంథాలయం వారిని ఎంతగానో ఆకర్షించింది. దాంతో కోల్సు కళాశాలలో పని చేస్తున్న సమయంలో కర్నూలు జిల్లాలో గూడా గ్రంథాలయాన్ని స్థాపించాలని వారు భావించారు.

1921 ప్రాంతంలో రాయలసీమ అంతా కలిపినా కేవలం ముప్పయి గ్రంథాలయాలు గూడా లేవు. ఇక కర్నూలు జిల్లాలోనయితే ఒక్కటీ లేదు. నిజానికి అలా స్థాపించడం అప్పట్లో పెద్ద సాహసమే. ఆంగ్లేయ ప్రభుత్వం గ్రంథాలయాలు నడిపే వారిపై ఒక కన్నేసి వుంచేది. కానీ ముచ్చుకోట గారు ఏ మాత్రం వెనుకడుగు వేయకుండా 1/8/1923 లో కొత్తపేటలోని తన స్వంత ఇంటిలో గ్రంథాలయాన్ని “ఆంధ్ర గ్రంథాలయం” అనే పేరుతో స్వంత ఖర్చుతో ప్రారంభించారు. వేంకటరామయ్య గారు దేశంలోని వివిధ ప్రాంతాలలోని పుస్తక ముద్రణదారులతో సంబంధాలు నెలకొల్పుకొని ఎంతో అమూల్యమైన గ్రంథాలు ఎప్పటికప్పుడు పాఠకుల కోసం తెప్పించేవారు. వారు ఉపాధ్యాయునిగా ఉద్యోగం నిర్వహిస్తూ వుండడం చేత సాయంకాలం 5 గంటల నుంచి 7 గంటల దాకా మాత్రమే గ్రంథాలయం తెరిచేవారు. 1955 లో పదవీ విరమణ చేశాక వీరు గ్రంథాలయంలో పత్రికా విభాగాన్ని ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఏడు వరకు తెరవడం మొదలు పెట్టారు.

డా॥ ఎం. హరి కిషన్


Masterkranthi.R

వేంకటరామయ్యగారు గ్రంథాలయ నిర్వహణకు సంబంధించి ఏ కోర్సులూ చదవకపోయినా వాటి నిర్వహణ తీరు చాలా అద్భుతంగా వుండేది. పుస్తకాలను దారంతో కుట్టి, చక్కగా బైండు చేసి, క్రమసంఖ్యలు వేసి, అద్దాల బీరువాలో వరుసగా భద్రపరిచేవారు. పురాణాలు, నవలలు, చరిత్ర, గణితం ఇలా ఇరవై భాగాలుగా విభజించబడి, పుస్తకాల కేటలాగు అందరికీ అందుబాటులో వుండేది.

1930 ప్రాంతంలో ఈ గ్రంథాలయం కొత్తపేట నుంచి నరసింహారావు పేటలోని తన నూతన స్వగృహంలోకి మార్చబడింది. ఇంటిలో నాలుగింట మూడువంతులు గ్రంథాలయ నిర్వహణకు ఉపయోగించారు. దీన్ని నడపడానికి ఆర్థికంగా ఇబ్బంది పడగూడదని తన ఇరవై ఎకరాలపై వచ్చే ఆదాయాన్ని దీని కోసమే ప్రత్యేకంగా ఉపయోగించేవారు. అలాగే వీరి సోదరి వెంకమ్మ గారు కూడా తన పదెకరాలపై వచ్చే ఆదాయాన్ని గ్రంథాలయ నిర్వహణకు పంపించేవారు.

రంగనాథరామాయణాన్ని ఎంతగానో అభిమానిస్తూ నిరంతరం పారాయణం చేసే వీరు 16 ఏళ్ళ వయసులో శ్రీరామ శతకం అనే చిన్న పుస్తకాన్ని రచించి ముద్రించారు. 1970-73 లో కర్నూలు జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులుగా పని చేసిన వీరు గ్రంథాలయ సంస్థ సభ్యులుగా జీవితాంతం కొనసాగారు. ప్రభుత్వం స్వాతంత్ర్యానంతరం ఈ గ్రంథాలయం గురించి తెలుసుకొని ఆర్థిక సహాయం అందజేయడానికి ముందుకు వచ్చినా, గ్రంథాలయాన్ని తమకు అప్పగించాలని కోరినా వీరు తన స్వేచ్ఛకు, ఆశయాలకు భంగం కలుగుతుందని భావించి సున్నితంగా తిరస్కరించారు.

ఆంధ్ర గ్రంథాలయంలో ఏడువేలకు పైగా అమూల్యమైన పుస్తకాలు వుండేవి. ఎక్కువగా తెలుగు, ఆ తరువాత ఆంగ్ల పుస్తకాలు వుండేవి. సంస్కృతం, ఉర్దూ, హిందీ పుస్తకాలు కొన్ని వుండేవి. 1953 లో కర్నూల్లో కేంద్ర గ్రంథాలయాన్ని ప్రభుత్వం స్థాపించేంత వరకు జిల్లాలో ఇదే అతిపెద్ద గ్రంథాలయం. ఎంతో మంది పరిశోధకులు ఎక్కడా దొరకని అరుదైన పుస్తకాల కోసం రాష్ట్రవ్యాప్తంగా ఇక్కడికి వచ్చేవారు. ప్రతి సంవత్సరం గ్రంథాలయానికి వార్షికోత్సవం నిర్వహించి పోటీలు జరిపి గెలిచిన వారికి బహుమతులను పుర ప్రముఖులచే అందించేవారు.


వేంకటరామయ్య ఉద్యోగం చేసినది ప్రయివేటు సంస్థ కాబట్టి వారికి ఎటువంటి పింఛను అందేది కాదు. అట్లాగే స్వాతంత్ర్య సమరయోధుల పింఛనుకు వీరు అర్హులైనా దానికి దరఖాస్తు చేయలేదు. అదేసమయంలో వీరి స్వగ్రామంలో వీరి భూముల నిర్వహణ బాధ్యతనంతా తన భుజస్కంధాల మీద మోస్తున్న వీరి సోదరి వెంకమ్మగారు మరణించారు. దానికి తోడు ఇంట్లో పిల్లలు పెద్దగయ్యారు. అనేక ఆర్థిక సమస్యలు వుప్పెనలా వీరిని చుట్టుముట్టాయి. అయినప్పటికీ వీరు గ్రంథాలయాన్ని నడపడం ఆపివేయడం గానీ, పుస్తకాలు, పత్రికలు తెప్పించడం నిలిపివేయడం గానీ 1972లో వారు మరణించేవరకు ఎప్పుడూ ఆపలేదు. ఆ తరువాత గూడా 1979 వరకు వారి వారసులు కొందరు ఈ గ్రంథాలయాన్ని నిర్వహించారు గానీ 1980 లో ఇది శాశ్వతంగా మూతబడింది. అందులోని విలువైన గ్రంథాలు కొన్ని వేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి తరలిపోగా, మిగిలినవి పుస్తక ప్రేమికులు తమ స్వంత గ్రంథాలయాలకు తీసుకొని పోవడం జరిగింది.

వనం శంకరశర్మ

ప్రజల్లో స్వాతంత్ర్యోద్యమకాంక్షను రగిలించడానికి, దేశభక్తిని పెంపొందించడానికి అక్షరాలనే ఆయుధాలుగా మార్చి నిర్భయంగా బ్రిటీష్ పాలకుల దమననీతిని నిరసిస్తూ పత్రికను నడిపిన వీరుడు వనం శంకరశర్మ. తన రచనల ద్వారా, పత్రికా ప్రచురణల ద్వారా నిరంతరం జాతీయభావాలను ప్రచారం చేసిన ఇతను 1900 సం॥ మార్చి 8న కడపజిల్లాలోని పులివెందుల తాలుకా కామట్లపల్లెలో జన్మించారు. కర్నూలుజిల్లా పత్తికొండలోని శ్రీ వనం క్రిష్ణయ్య, ఛాయమ్మ దంపతులు వీరిని దత్తత తీసుకోవడంతో జీవితాంతం పత్తికొండలోనే నివసించారు.

వనం శంకరశర్మ ప్రాథమిక విద్య పత్తికొండలోనూ, ఆ తరువాత అనంతపురం జిల్లాలో గొల్లాపిన్ని వేంకటసుబ్బశాస్త్రి వద్ద వేదశాస్త్ర, జ్యోతిష్యవిద్యలను అభ్యసించారు. కర్నూలు సంస్కృత పాఠశాలలోని గోడా కృష్ణశాస్త్రిగారి వద్ద పద్యకావ్యాలు, ప్రబంధాలు, పురాణాలు అధ్యయనం చేశారు. ఆ తరువాత ఆత్మకూరు తాలుకా కురుకుంద గ్రామంలోని శ్రీమధుర భారతుల సుబ్బయ్యగారి వద్ద ఒక సంవత్సరం ఆయుర్వేద విద్య అభ్యసించారు. 14వ ఏట శ్రీమతి సుబ్బమ్మగారితో వివాహం జరిగింది. వీరికి ఒక కుమార్తె వున్నారు. వీరు కవిగా, పాత్రికేయునిగా, నాటకకర్తగా, నటునిగా, జ్యోతిష్కుడిగా, ఆయుర్వేద వైద్యునిగా, పంచాంగం, పౌరోహిత్యం నెరపుతూ వివిధ రంగాలలో రాణించడం జరిగింది.

దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు గారి ప్రేరణతో వీరు జాతీయభావాలు అలవర్చుకొని 1921 సం॥ జాతీయ కాంగ్రెస్‌లో ప్రవేశించారు. స్వాతంత్ర్య పోరాటంలో తన వంతు పాత్ర పోషిస్తూ 1924లో ఐంద్రావతి పత్రిక స్థాపించారు. ఇందులో బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా నిర్భీతిగా వ్యాస పరంపర ప్రచురించసాగారు. విప్లవ యువకిశోరం సర్దార్ భగత్‌సింగ్ చివరిరోజుల్లో చేసిన ఉపన్యాసాల్ని ఐంద్రావతి పత్రికలో ప్రముఖంగా ప్రచురించారు. దానితో బ్రిటీష్ ప్రభుత్వం ఆగ్రహం చెంది ఆ పత్రికపై రెండువేల రూపాయలు జరిమానా విధించారు. వారికి జరిమానా కట్టి పత్రిక నడపడం బానిస ప్రవృత్తి క్రింద వస్తుందని భావించిన శర్మ పత్రికను మూసివేశారు. ఆ



డా॥ ఎం. హరి కిషన్

తరువాత కొంతకాలానికి శారద అనే పత్రికను ప్రారంభించారు. కానీ అందులోని వార్తల్ని గమనించిన ప్రభుత్వం తొమ్మిది నెలల్లోనే దానిని నిషేధించింది. కొన్నాళ్ళకు ప్రకాశం పంతులుగారి ప్రోత్సాహంతో హితవాది అనే పత్రికను నడుపుతూ సాంఘిక దురాచారాలను నిరసిస్తూ, సంఘసంస్కరణకు పాటుపడ్డారు.

వీరు 1924 నుండి 1932 వరకు పత్తికొండ గ్రామపంచాయితీ అధ్యక్షులుగానూ, తాలుకాబోర్డు సభ్యులుగానూ పని చేసి పత్తికొండ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు.

గాంధీజీ స్వదేశీ ఉద్యమం కోసం ఇచ్చిన పిలుపునందుకొని 1924లో కర్నూలులో ప్రారంభించిన ఖద్దరుబోర్డులో సభ్యులుగా చేరారు. ఖద్దరు ప్రచారం కోసం గాంధీజీ భారతదేశమంతా పర్యటిస్తూ కర్నూలుకు రెండవసారి రావడం జరిగింది. వనం శంకరశర్మ వీరిని పత్తికొండకు ఆహ్వానించారు. శంకరశర్మ గారి కోరిక మేరకు 1929 మే 21వ తేదీ మహాత్మాగాంధీ పత్తికొండలో అడుగుపెట్టడం జరిగింది. ఖద్దరు నిధికి ప్రజల ద్వారా చందాలు వసూలు చేసి, తానూ కొంత కలిపి 1,116 రూపాయలు అప్పటి కాలంలోనే మహాత్మాగాంధీకి విరాళంగా ఇవ్వడం జరిగింది. వీరు మహాత్మాగాంధీ సిద్ధాంతాలపై "శ్రీ మహాత్మాగాంధీ శతకం" రచించి రాష్ట్ర పభుత్వంచే సన్మానం అందుకోవడం జరిగింది.

వీరు సంసారయాత్ర, దేశభక్తి, జగన్మాయలాంటి సాంఘిక నాటకాల్ని ప్రజాసమస్యల్ని తీసుకొని చైతన్యవంతంగా రచించాడు. అప్పులు తిప్పలు అనే ఏకాంకిక, భక్త పుండరీక అనే భక్తిరస నాటకం రచించారు. శ్రీ రసిక జన వినోదిని నాట్యమండలి స్థాపించి నాటకాలను రచిస్తూ, ప్రదర్శిస్తూ సాంఘిక దురాచారాల నిర్మూలనకు ఎంతగానో కృషి చేశారు. వీరు నాటకకర్తే గాక మంచి నటుడు గూడా. కర్నూలు పట్టణంలో రామదాసు నాటకాన్ని బళ్ళారి రాఘవ ప్రదర్శించవలసిన సమయంలో కొన్ని కారణాల వల్ల రాఘవగారు రాలేకపోయారు. నాటక ప్రదర్శన ఆగకుండా వెంటనే శంకరశర్మగారే రామదాసు పాత్రను అద్వితీయంగా పోషించి అందరిచే ప్రశంసలు అందుకోవడమే గాక బంగారు పతకాన్ని కూడా బహుమానంగా అందుకున్నారు. మద్యపాన నిషేధం, బాల్యవివాహాలు, వరకట్నం, హరిజనోద్ధారణ లాంటి అనేక అంశాలు వీరి నాటకాలలో కనబడుతుండేవి.

హరికథాంశ కవితా విశారద, భాషాప్రవీణ, అభినవ జ్యోతిష్కళా సిద్ధాంతిలాంటి ఎన్నో బిరుదులు వీరిని వరించాయి.

స్వాతంత్ర్యానంతరం ఎటువంటి పదవులూ ఆశించక అనేక పుస్తకాలు రచిస్తూ, తన స్వంత ప్రెస్సులో అనేక పుస్తకాలను ప్రచురిస్తూ కవిగా, సంఘసంస్కర్తగా మంచి పేరు తెచ్చుకొన్న వీరు 1976 మార్చి 8న స్వర్గస్తులయ్యారు. జననం, మరణం ఒకే నెల, ఒకే తేదీ కావడం ఒక విశేషం.

ధరణి రామచంద్రరావు

ప్రముఖ సాహితీవేత్త, చరిత్రాన్వేషి, స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘసంస్కర్త అయిన ధరణి రామచంద్రరావుగారు పత్తికొండ తాలుకాలోని పి. కోటకొండ గ్రామంలో 1904 ఆగష్టు 4వ తేదీన జన్మించారు. వీరి తల్లిదండ్రులు లక్ష్మమ్మ, వెంకప్ప. రామచంద్రరావుగారు కర్నూలు మునిసిపల్ హైస్కూల్‌లో పాఠశాల విద్యను అభ్యసించి, అనంతపురంలో కళాశాల విద్యను చెన్నయ్‌లోని ప్రెసిడెన్సీ కళాశాలలో లా చదువును పూర్తి చేశారు.

పత్తికొండలో వున్న ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు వనం శంకరశర్మ గారితో వీరికి చాలా సాన్నిహిత్యం వుండేది. ఐంద్రావతి పత్రికకు వనం శంకరశర్మ సంపాదకులుగా వుండగా, వీరు ఉప సంపాదకులుగా వున్నారు. సాహిత్యమన్నా, చరిత్ర అన్నా ఎంతో ఇష్టపడే ధరణిగారు "కర్నూలు నవాబులు" అనే చారిత్రక వ్యాసాన్ని రచించగా భారతి మాసపత్రిక ప్రచురించింది. వీరు "ఛత్రపతి శివాజీ – శ్రీ భ్రమరాంబ కరవాలము" అనేది గూడా రచించారు. వీరి రచనల్లో అత్యంత ముఖ్యమైనది. తరతరాలకు వారసత్వంగా నిలిచేది "కర్నూలు మండల చరిత్రము". కర్నూలు మండలానికి సంబంధించిన అనేక విషయముల గూర్చి పరిశోధనలు చేసి, తనకు తెలిసిన, పెద్దలు చెప్పిన విషయాలు అందులో చేరుస్తూ ఈ పుస్తకాన్ని ప్రచురించడం జరిగింది.

గాడిచెర్ల హరిసర్వోత్తమరావు, వనం శంకరశర్మలతో పాటు వీరు స్వాతంత్ర్య ఉద్యమంలో చాలా చురుగ్గా పాల్గొన్నారు. 1927 లో నంద్యాలలో జరిగిన కర్నూలు జిల్లా నాలుగవ కాంగ్రెస్ కమిటీ సమావేశాలకు హాజరై అందులో చురుగ్గా పాల్గొంటూ బ్రిటిష్ ప్రభుత్వం బంధించిన దేశభక్తుడు సుభాష్ చంద్రబోస్‌ను వెంటనే విడుదల చేయాలని ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరిచారు. మహాత్మాగాంధీ సూచనలు పాటిస్తూ హరిజనోద్ధరణకు ఎంతగానో కృషి చేశారు. దళితుల ఆలయప్రవేశమును, సహపంక్తి భోజనాలను ఎన్నో కష్టాలను ఎదుర్కొని ధైర్యంగా ముందుండి నడిపారు.

ప్రజల్లో వున్న దురాచారాలను నిర్మూలించడానికి ఎంతగానో కృషిచేశారు. జూదం, మత్తుమందులు ప్రజల ఆరోగ్యాన్ని, ఆస్తిని హరించేస్తాయని, ప్రజలు ఆ దురాచారాలనుంచి విముక్తి


Masterkranthi.R
2016

పొందినప్పుడే ఆ కుటుంబాలు అభివృద్ధి చెందుతాయనీ చెప్పేవారు. కల్లు దుకాణాల ముందు పికెటింగులు నిర్వహించేవారు. మద్యపానం వల్ల అనేక కుటుంబాలు విచ్ఛిన్నమై పోతున్నాయి, అనేక మంది మృత్యువాత పడుతున్నారని నిరసిస్తూ దానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని నిర్వహించారు.

వీరు కోటకొండ, కప్పట్రాళ్ళ మధ్యగల కౌలుట్ల చెన్నకేశవస్వామి ఆలయానికి ధర్మకర్తగా 35 సంవత్సరాలపాటు ఎంతో కృషి చేశారు. ఈ ఆలయం కౌండిన్య మహామునిచే నిర్మించబడింది. శిథిలావస్థలో వున్న దీన్ని ఎంతో శ్రద్ధతో, అనేకమంది సహకారంతో పునరుద్ధరించారు. కాశ్మీర్ మహారాజు రాజా కరణ్‌సింగ్ వారి తండ్రి జ్ఞాపకార్థం ఒక దీప స్తంభాన్ని కౌలుట్లలో నిర్మించారు. బ్రహ్మోత్సవాల సమయంలో నేటికీ ఆ దీపాన్ని వెలిగిస్తూ వున్నారు. బాబూ రాజేంద్రప్రసాద్, కంచి కామకోటి పీఠాధిపతులు, ప్రముఖులు ఎందరో ఈ ఆలయానికి తమ వంతు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఇక్కడ సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం నిజాం నవాబుల సహకారంతో ఒక ఆడిటోరియం గూడా నిర్మించారు.

ధరణి రామచంద్రరావుగారు ఆకాశవాణిలో "నాడు – నేడు" అనే పేరుతో కర్నూలుజిల్లా ప్రాశస్త్యము గురించి అనేకమార్లు ఉపన్యసించారు. వీరు మంచి ఫోటోగ్రాఫర్ కూడా. స్వాతంత్ర్యోద్యమానికి సంబంధించిన అనేక సంఘటనలను తన కెమెరాలో బంధించారు. కానీ దురదృష్టం కొద్దీ అందులో చాలా వరకు లభించలేదు.

1974 మార్చి 11వ తేదీన కర్నూలులో స్వర్గస్తులైన వీరు తమ రచనల ద్వారా, సంఘసంస్కరణద్వారా, ప్రజాసేవ ద్వారా శాశ్వత కీర్తిని ఆర్జించారు.



ధరణి రామచంద్రరావు గారు తీసిన ఫోటో

విలియం ఆర్థర్ స్టాంటన్

కర్నూలు జిల్లాలో అనేక విద్యాలయాలు స్థాపించి క్రింది కులాలకు విద్యను అందుబాటులోనికి తీసుకువచ్చిన మహనీయుడు. సమాజానికి దూరంగా నిరాదరణకు గురైన వెలివాడల్లో వెలుగును నింపి క్రైస్తవ మతాన్ని వారి ముంగిట నిలిపిన మిషనరీ విలియం ఆర్థర్ స్టాంటన్.

డా॥ డబ్ల్యు.ఎ.స్టాంటన్ గారు 1867 డిసెంబర్ 24న విలియం .ఇ.స్టాంటన్, కెరీకెన్నిలకు ఉత్తర అమెరికాలో జన్మించారు. అమెరికాలోని కోల్గెట్ విశ్వవిద్యాలయంలో వున్నత విద్యను పూర్తి చేసి 1892 లో మిషనరీ విద్యను అభ్యసించారు. విద్య పూర్తయిన వెంటనే వివాహం, వివాహం అయిన వెంటనే భారతదేశంలో క్రీస్తు సువార్తను వ్యాప్తి చెందించడానికి ప్రయాణంను వెంటనే సాగిపోయాయి. మద్రాసు నుండి బాపట్ల చేరి అక్కడ మిషనరీ సేవల్లో పాల్గొంటూ తెలుగు భాషలో ధారాళంగా మాట్లాడ్డం సంవత్సరంకంతా నేర్చుకున్నారు. ఆ తరువాత వీరు కర్నూలుకు వచ్చారు.

కర్నూలులో మిషనరీలు ఎవరూ ఎక్కువ కాలం వుండలేక పోయేవారు. ఇక్కడి వేడి వాతావరణం, కలరా మశూచి లాంటి అంటువ్యాధుల బారినపడి వారు అల్లాడిపోయేవారు. అప్పట్లో కర్నూలుని ఆంగ్లేయులు “ తెల్లవారి సమాధి తోట” అని పిలుచుకునేవారు. అటువంటి సమయంలో స్టాంటన్ ఏడవ మిషనరీగా కేవలం ఇరవై ఐదు సంవత్సరాల చిన్న వయసులోనే బాధ్యతలు స్వీకరించారు. 1894 నుంచి 1934 వరకు దాదాపు నలభై సంవత్సరాలు కర్నూలు నగరంలో నివసిస్తూ ఇక్కడి జీవితంతో విడదీయలేని అనుబంధాన్ని కలిగి క్రైస్తవ మత విశ్వాసులను పెంచడానికి కృషి చేశారు.

స్టాంటన్ కర్నూలు ప్రజలకి చేసిన అతిగొప్ప సహాయం ఇక్కడ విద్యాభివృద్ధికి బాటలు వేయడమే. సువార్త సేవకులను తయారు చేసుకోవడం ప్రధాన వుద్దేశ్యమయినప్పటికీ, వీరు స్థాపించిన పాఠశాలలవల్ల జిల్లాలోని అన్ని వర్గాల, మతాల ప్రజలు విద్యావంతులు కావడానికి, తద్వారా జిల్లా ప్రగతి పథంలో ప్రయాణించడానికి మార్గం సుగమమం అయింది.

స్టాంటన్ గారు 1905 లో ఎ.బి.ఎం. ఉన్నత పాఠశాలను (అమెరికన్ బాపిస్ట్ మిషన్ ఉన్నత పాఠశాల) స్థాపించారు. అప్పట్లో దీనికి ఎటువంటి వసతులూ, కనీసం నల్లబల్లలు గూడా వుండేవి కావు. దానితో బాటు ప్రభుత్వం అప్పట్లో ఒక నగరంలో ఒక ఉన్నత పాఠశాలకు మాత్రమే అనుమతి ఇచ్చేది. దాంతో అప్పటికే మున్సిపల్ వున్నత పాఠశాల కర్నూలులో వున్నందు వలన దీనికి అనుమతి రాలేదు. స్టాంటన్ అనేక మందిని కలసి, అధికారులకు చెప్పించి చివరకు అనుమతిని సాధించారు. ఈ పాఠశాల భవనాన్ని నిర్మించడానికై అమెరికాలోని అకర్మన్ కోల్బు గారిని సహాయం అభ్యర్థించి పదివేల డాలర్లు విరాళంగా సంపాదించి పాఠశాల భవనాన్ని విశాల ప్రాంగణంలో 1908 కల్లా నిర్మించగలిగారు. నిర్మాణానికి



డా॥ ఎం. హరి కిషన్

సహకరించిన కోల్సు గారి పేరు మీద దీనికి “కోల్సు స్మారక ఉన్నత పాఠశాల” గా పేరు మార్చడం జరిగింది. కోల్సు గారు ఆ తరువాత కొత్త గదుల నిర్మాణం కోసం మరో 1900 డాలర్లు ఈ పాఠశాలకు విరాళంగా పంపించారు. అప్పట్లో ఈ పాఠశాల జిల్లా వాసులకు ఒక వరంగా మారింది. అనేక మంది మేధావులు, వున్నతాధికారులు, రాజకీయ నాయకులను జిల్లాకు అందించగలిగింది.

స్టాంటన్ గారు నిరక్షరాస్యులైన విద్యార్థులు, సరిగా చదవని పిల్లలు, అంగవికలాంగులైన బాలుర కోసం నాలుగున్నర ఎకరాలలో “ఇండస్ట్రియల్ స్కూల్” ఏర్పాటు చేశాడు. ఇక్కడ నేతపని, వడ్రంగం, చర్మంతో వస్తువులు తయారు చేయడం, పండ్లతోటలు పెంచడంలో మెళకువలు, ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం... ఇలా విద్యార్థులను సాంకేతిక పద్ధతుల్లో నేర్పరులుగా తయారు చేయడానికి కృషి చేశారు. అమెరికా నుంచి ఆధునిక పనిముట్లను తెప్పించేవారు. ఈ సాంకేతిక పాఠశాల తరువాత ‘రాక్‌వుడ్ స్మారక పాఠశాల’గా మారిపోయింది. స్టాంటన్ గారు పల్లెల నుంచి వచ్చే నిరుపేద బాలలకోసం రెండు బోర్డింగ్ పాఠశాలలు నిర్మించాడు. ప్రస్తుతం వున్న ఎస్.టి.బి.సి. కళాశాల భవనం అప్పట్లో స్టాంటన్ గారు ఏర్పరచిన బోర్డింగ్ పాఠశాలే. బాలికల విద్యకు అప్పట్లో ప్రోత్సాహం, వసతులు చాలా తక్కువగా వుండేవి. స్త్రీలు విద్యావంతులైనప్పుడే దేశం నిజమైన అభివృద్ధి సాధిస్తుంది. అందుకే స్టాంటన్ గారు ఇ.సి.ఎం. బాలికల పాఠశాలను నిర్మించారు. నగరంలో బాలికల మొదటి పాఠశాల ఇదే. క్రైస్తవ మతం పుచ్చుకున్న పేదల కోసం కర్నూలుకు దగ్గర్లో కోల్సు ఆనందాపురం, ఆత్మకూరు సమీపంలో కోల్సు ధర్మాపురం అనే రెండు గ్రామాలు నిర్మించారు. వ్యవసాయం చేస్తూ వారు ఆర్థికంగా ఎదగడానికి తోడ్పడ్డారు. కోల్సు ఆనందాపురాన్నే ప్రస్తుతం స్టాంటన్ పురంగా పిలుస్తున్నారు.

కర్నూలు నగరంలో క్రైస్తవులు ప్రార్థన చేయడానికి ఒక సుందరమైన విశాలమైన చర్చిని నిర్మించాలనితలంచిన స్టాంటన్ గారు, కోల్సు ఆర్థిక సహకారంతో స్థలాన్ని కొని నిర్మాణం ప్రారంభించారు. కోల్సుగారు 7500 డాలర్లు విరాళంగా పంపడమే గాక గుడిగంటను, చర్చి పై భాగంలో అ లంకరించడం కోసం అందమైన గడియారాన్ని అమెరికానుంచి పంపించారు. 1917 లో ప్రారంభమైన ఈ చర్చి 1919 సెప్టెంబరులో పూర్తయింది. స్టాంటన్ కర్నూలు నగరంలో చేసిన ప్రతి పని వెనుక కోల్సుగారి సహాయ సహకారాలు అండదండలు ఎంతగానో వున్నాయి.

స్టాంటన్ గారు అవుటాఫ్ ఈస్ట్, ది అవేకింగ్ ఆఫ్ ఇండియా ఫార్టీ ఇయర్స్ అమాంగ్ తెలుగూస్ అనే పుస్తకాలను రచించారు. ది అవేకింగ్ ఆఫ్ ఇండియా పుస్తకంలో జిల్లాకు చెందిన అప్పటి అపురూప చిత్రాలు చాలా వున్నాయి. వీరు రాక్‌వుడ్ గారితో కలసి “కర్నూలు జూబ్లీ” అనే పుస్తకాన్ని గూడా ప్రచురించారు. స్టాంటన్ గారు నలభై సంవత్సరాల సుదీర్ఘకాలం మిషనరీగా సేవలనందించి తన 67 వ ఏట 1934 న అమెరికా వెళ్ళిపోయారు. 1954 మార్చి నాలుగున ప్రభువు చెంతకు చేరిన వీరి స్మృత్యర్థం 1960 లో శ్రీనివాస నగర్‌లో నిర్మించిన చర్చికి స్టాంటన్ చర్చి అనే పేరు పెట్టడమే గాక, కోల్సు కళాశాల నిర్మించి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంలో వీరి విగ్రహాన్ని కళాశాల ఆవరణలో ప్రతిష్ఠించారు.


నివర్తి వేంకటసుబ్బయ్య

మన కర్నూలు జిల్లాలోని ప్రఖ్యాత స్వాతంత్ర్య సమర యోధులలో నివర్తి వేంకటసుబ్బయ్య ఒకరు. వీరు 1910 నవంబర్ 24న శ్రీమతి హనుమక్క, అచ్చయ్య దంపతులకు పత్తికొండలో జన్మించారు. కర్నూలులో పాఠశాల విద్యను, అనంతపురంలో డిగ్రీని పూర్తి చేసుకొని ప్రభుత్వ కొలువులో చేరారు. ఆ సమయంలో మహాత్మాగాంధీ నాయకత్వంలో ఆంగ్లేయులకు వ్యతిరేకంగా భారతదేశమంతా స్వాతంత్ర్య పోరాటం వువ్వెత్తున ఎగిసిపడుతూ వుంది. దానికి ఆకర్షితుడైన వేంకటసుబ్బయ్య పరాయి పాలకుల వద్ద పని చేయడానికి ఇష్టపడక తాలుకాఫీసులోని తన ఉద్యోగానికి రాజీనామా చేసి తానూ స్వాతంత్ర్య పోరాటంలోకి ప్రవేశించాడు.

టంగుటూరి ప్రకాశం పంతులు ఆంధ్ర ప్రాంతంలో చాలా చురుగ్గా స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడుపుతూ, తన ఉపన్యాసాలతో ప్రజలను ఉత్తేజపరుస్తూ, జాతీయ భావనలను అందరి మదిలో నాటుతూ వుండేవాడు. వారి పట్ల ఆకర్షితుడైన వేంకటసుబ్బయ్య 1932లో ప్రకాశం స్వరాజ్య పత్రికలో ఉపసంపాదకుడిగా పని చేస్తూ జాతీయ భావాలను వ్యాప్తి చేసే వార్తలను, వ్యాసాలను ప్రచురించసాగాడు. 1935లో ఆ పత్రిక మూతపడిన తరువాత నంద్యాలకు చేరుకొని హిందూ పత్రికలో విలేఖరిగా చేరాడు.

కరువు ఆ కాలంలో రాయలసీమ జిల్లాల్లో విలయతాండవం చేసింది. రైతులు పంటలు పండక, తినడానికి తిండి లేక అష్టకష్టాలు పడ్డారు. 1935-36లో రాయలసీమకు విచ్చేసిన డా॥ రాజేంద్రప్రసాద్, రాజగోపాలాచార్యుల వెంట తిరుగుతూ క్షామ పీడిత గ్రామాలను వారికి చూపించి దాని తీవ్రతను వివరించారు. రైతు ఉద్యమాన్ని ప్రారంభించి వారిని సంఘటితం చేశారు. 1936లో కర్నూలు జిల్లా క్షామ నివారణ సంఘాన్ని ప్రారంభించి రైతుల సంక్షేమం కోసం అనేక పోరాటాలు చేసి వారికై పాటుపడ్డాడు.

వ్యక్తి సత్యాగ్రహ ఉద్యమం ప్రారంభమయిన వెంటనే వీరు తన అనుచరులతో దానిలో పాల్గొన్నారు. బ్రిటీష్ ప్రభుత్వం వీరిని బంధించి 1940లో ఎనిమిది నెలలు అనుచరులతో సహా కారాగార శిక్ష విధించి వేలూరు, అల్లీపురం జైళ్ళకు పంపించింది.


Masterkranthi.R
2016

1942 ఆగష్టులో బొంబాయిలో జరిగిన ఏఐసిసి సమావేశాల్లో పాల్గొనడం జరిగింది. క్విట్ ఇండియా తీర్మానం ఆమోదానికి సహకరించారు. ఆ తరువాత వీరు కొంతకాలం అజ్ఞాతంలోకి వెళ్ళిపోయారు. విప్లవ భావాల పట్ల ఆకర్షితులయ్యారు. విద్యార్థులతో రహస్యదళాలు ఏర్పాటు చేసి విప్లవోద్యమ విధివిధానాలను ఒక కరపత్రంగా తయారు చేశారు. 1942లో బ్రిటీష్ ప్రభుత్వం దానిని నిషేధించింది. ఆ కరపత్రాన్నే 'ఆంధ్ర సర్క్యులర్'గా పేర్కొంటారు. బ్రిటీష్ ప్రభుత్వం వీరిని పట్టుకోవడానికి ఎంతగానో ప్రయత్నించింది. కానీ వీరు ఎవరికీ దొరక్కుండా అజ్ఞాత జీవితం గడుపుతూ విప్లవ కార్యకలాపాల్లో పాల్గొనసాగారు. అలా రెండు సంవత్సరాలు గడిచాక 1944లో వీరు మరలా జనస్రవంతిలోకి రావడం జరిగింది.

మహాత్మాగాంధీ నడిపే సేవాగ్రామ్‌కు వెళ్ళి గాంధీజీ ఆదేశాల మేరకు తాను స్వయంగా లొంగిపోతున్నట్లు కర్నూలు జిల్లా మెజిస్ట్రేట్‌కు వర్తమానం పంపారు. మహాత్మాగాంధీ సమక్షంలోనే వీరు స్వయంగా అరెస్టయ్యారు. ఆరు నెలలపాటు కర్నూలు సబ్‌జైలులో కారాగార శిక్షను అనుభవించారు. బనగానపల్లె నవాబు నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి అది భారతదేశంలో కలిసిపోయేంత వరకు జరిగిన ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు.

స్వాతంత్ర్యానంతరం వీరు నంద్యాల సహకార గృహనిర్మాణ సంఘం, నంద్యాల సహకార చక్కెర కర్మాగారం మొదలగు సంస్థలు నిర్మించి ప్రజలను సంఘటితం చేశారు. 1953-55 కాలంలో మనసీమ అనే వారపత్రికను నడుపుతూ రాయలసీమ అభివృద్ధి కోసం కృషి చేశారు. రాయలసీమ మండలి అధ్యక్షులుగానూ, రాష్ట్ర ఖాదీబోర్డు సభ్యులుగానూ, మద్యనిషేధ సంఘం సభ్యులుగానూ పని చేసి సమస్యల తొలగింపుకు కృషి చేశారు. మంచి సమాజం నిర్మాణం కావాలంటే పిల్లలకు నాణ్యమైన విద్యను అందిస్తూ, వారిలో సత్ప్రవర్తనను పెంచి మంచి పౌరులుగా తయారు చేసి సమాజానికి అందించాలనే సదుద్దేశంతో నంద్యాలలో "రామకృష్ణా విద్యాలయం" అనే పేరుతో పాఠశాలను ఏర్పాటు చేసి ఉన్నత భావాలను విద్యార్థుల్లో పాదుకొల్పడానికి కృషి చేశారు.

వీరు 1946 నుండి 56 వరకు మద్రాసు, ఆంధ్ర రాష్ట్రాలలో శాసనసభ్యులుగా వున్నారు. 1958, 1974లలో శాసనమండలి సభ్యునిగా కొనసాగారు. శాసన మండలి అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శాసనమండలి అధ్యక్షులుగా వున్న సమయంలోనే హైదరాబాదులో జరిగిన ఓ సాంస్కృతిక సభలో "భారతదేశ కళలు - సంస్కృతి సంప్రదాయాలు" అనే అంశంపై ఉపన్యసిస్తూ హఠాత్తుగా గుండెపోటుకు గురయి 1978న వేదికపైనే స్వర్గస్తులయ్యారు.

స్వాతంత్ర్య సమర యోధునిగా, రాయలసీమ అభివృద్ధికి పాటుపడిన వ్యక్తిగా, మద్యనిషేధం లాంటి దురాచారాన్ని రూపుమాపడానికి కృషి చేసిన సంఘసేవకునిగా పత్రికా సంపాదకుడుగా వీరు అందించిన సేవలవల్ల కర్నూలుజిల్లా ప్రజల మనస్సులో శాశ్వత స్థానం సంపాదించుకున్నారు.

సర్దార్ నాగప్ప

దళితుడైన సర్దార్ నాగప్పగారి జన్మస్థలం కర్నూలు పట్టణమే. వీరి తల్లిదండ్రులు అంకమ్మ, బుచ్చయ్య. స్కూల్ ఫైనల్ వరకు చదివిన వీరు జాతీయోద్యమం పట్ల ఆకర్షితులై వ్యక్తి కన్నా వ్యవస్థయే మిన్న అని భావించి చదువును వదిలి స్వాతంత్ర్య ఉద్యమంలోకి అడుగుపెట్టారు. 1936లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో శాసనసభకు ఎన్నికయ్యారు. 1937లో జరిగిన ఎన్నికలలో కర్నూలు రిజర్వ్‌డ్ స్థానం నుండి శాసనసభ్యులుగా మరలా స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా సత్యాగ్రహ సమరంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడినందుకు 1940న ఒక సంవత్సరం పాటు బళ్ళారి, వేలూరు, తిరుచునాపల్లిలలో కఠిన కారాగారశిక్షను అనుభవించారు. బైటికి విడుదలయిన తరువాత 1941లో మునిసిపల్ హైస్కూల్‌లో పెద్ద ఎత్తున సమ్మెను నిర్వహించారు. క్విట్ ఇండియా ఉద్యమంలో చురుగ్గా పాల్గొని ప్రజలను సమీకృతం చేసి, జాతీయతా భావాన్ని వారి మదిలో నాటారు. ఆంగ్ల ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. దీనితో 1942-44 మధ్యకాలంలో మరలా కారాగారశిక్షను అనుభవించారు.

భారత స్వాతంత్ర్యానంతరం డా॥ అంబేద్కర్ అధ్యక్షతలో మొత్తం తొమ్మిది మంది సభ్యులతో భారత రాజ్యాంగ రచన కోసం ముసాయిదా కమిటీని వేశారు. అందులో వీరు కూడా ఒకరు. రాజ్యాంగ రచనలోని ముఖ్యమైన కమిటీలో సభ్యుడై రాజ్యాంగ నిర్మాణంలో భాగస్వామియై కర్నూలు జిల్లాకు ఎంతో గర్వకారణమయ్యారు. రాజ్యాంగంలో రిజర్వేషన్లు "ఓన్లీ టెన్ ఇయర్స్" అని అంబేద్కర్ ప్రస్తావించగా "ఓన్లీ" అనే పదం తొలగించడానికి వీరు ఎంతగానో కృషి చేశారు.

సర్దార్ నాగప్పగారు ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగానూ, కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ ఎగ్జిక్యూటివ్ కార్యదర్శిగానూ, ఆంధ్రప్రదేశ్ ఆది ఆంధ్ర సంఘం ప్రధాన కార్యదర్శిగానూ, అఖిల భారత అల్పసంఖ్యాక వర్గాల, బలహీన వర్గాల సమాఖ్య సంస్థాపక అధ్యక్షునిగానూ, ఆంధ్రప్రదేశ్ ప్రజా సోషలిస్టుపార్టీ సంయుక్త కార్యదర్శిగానూ, అల్పసంఖ్యాక కార్మిక వర్గాల పార్టీ ఉపాధ్యక్షులుగానూ ఎన్నో బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించి 1993 ఏప్రిల్ 29న స్వర్గస్థులయ్యారు.



డా॥ ఎం. హరి కిషన్

మహాత్మాగాంధీ, ఆర్. వెంకటరామన్, రాజగోపాలాచారి వంటి అనేక మంది గొప్ప నేతల సహచర్యం వల్ల, నిజాయితీతో కూడిన వ్యక్తిత్వం వల్ల, దళితుల కోసం చేపట్టిన అనేక పోరాటాల వల్ల, స్వాతంత్ర్య సమరంలో మడమతిప్పని పోరాటం వల్ల, స్త్రీలను గూడా అందులో భాగస్వామ్యం చేసి మాటలు కాక చేతలు వుండాలని చాటడం వల్ల వీరు కర్నూలుజిల్లాలో అందరూ శాశ్వతంగా గుర్తుంచుకునేంత స్థాయికి ఎదిగి యువకుల్లో చైతన్య స్ఫూర్తిని నింపుతూ వున్నారు.

అమరావతమ్మ



అమరావతమ్మ గారు 1913లో జన్మించారు. చిన్నవయసులోనే నాగప్పగారితో వివాహం జరిగింది. భర్త చూపించిన దారిలోనే ఈమె పయనం కొనసాగింది. తాను గూడా నిర్భయంగా మహాత్మాగాంధీ సూచనలు పాటిస్తూ, జాతీయ భావనలు మహిళల్లో రేకెత్తిస్తూ సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొన్నారు. కర్నూలు సబ్ జైలులో రెండు నెలల పాటు, వేలూరు జైలులో 1941లో పదినెలల పాటు కారాగార శిక్షను అనుభవించారు. ఐనా ఏ మాత్రం వెనకడుగు వేయక స్వాతంత్ర్యం కోసం ఎన్ని కష్టాలైనా లెక్క చేయక జైలు నుంచి విడుదలైన మరుక్షణమే మరలా స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని 1942లో మరలా పాల్గొని సంవత్సరం పాటు జైలుశిక్షను అనుభవించారు. ఈ విధంగా ఎందరికో మార్గదర్శనం గావించిన అమరావతమ్మగారు స్వాతంత్ర్యం సిద్ధించాక భర్తకు చేదోడు వాదోడుగా వుంటూ దళిత, మహిళల సమస్యల్లో పాలు పంచుకుంటూ 1971లో స్వర్గస్తులైనారు.

స్వాతంత్ర్యకాలంనాటి సాంఘిక పరిస్థితుల వల్ల ఆడవాళ్ళు బైటికి రావడమే అరుదు. అటువంటి సమయంలో ఈ దంపతులు నిర్భయంగా, ఎవరినీ లెక్క చేయక, జాతీయోద్యమంలో పాల్గొంటూ అనేక మందికి మార్గదర్శకత్వం వహించారు. స్వాతంత్ర్యోద్యమంలో దళితులు, మహిళలు పాల్గొనడానికి మార్గం చూపించారు.


యాళ్ళూరి స్వామిరెడ్డి

1942లో "మా దేశాన్ని మేమే పాలించుకుంటాం. మీరు ఇక్కడి నుంచి వెళ్ళిపోండి" అంటూ ఆంగ్లేయ పాలకుల్ని ధిక్కరిస్తూ భారతదేశమంతా క్విట్ఇండియా కార్యక్రమం ప్రారంభమయింది. ప్రభుత్వ ఆజ్ఞల్ని ధిక్కరించడం, సత్యాగ్రహం చేయడం, అరెస్టయి జైళ్ళకు వెళ్ళడం అనేకమంది చేయసాగారు. ఆ సమయంలో ప్రభుత్వాన్ని స్తంభింపచేయడం కోసం ఒక యువకుడు టెలిఫోన్ స్తంభాల వైర్లు కత్తిరించి సమాచార వ్యవస్థను ధ్వంసం చేయడానికి, రైలు పట్టాలను తొలగించి రాకపోకలను అడ్డుకోవడానికి, గ్రామోద్యోగులను జాతీయోద్యమంలో పాల్గొంటూ బానిస కొలువులను వదులుకోమని హెచ్చరిస్తూ వారి చేత రాజీనామాలు చేయిస్తూ విప్లవ కార్యక్రమాలతో కర్నూలు ప్రాంతంలో సంచలనం సృష్టించాడు. అతడే యాళ్ళూరి స్వామిరెడ్డి. చివరికి ఇతన్ని పట్టుకొని 18 నెలల కారాగారశిక్షను విధించారు. ఐనా ఏ మాత్రం వెనకడుగు వేయక జైలునుంచి బైటకు విడుదలయిన మరుక్షణమే కమ్యూనిస్టు పార్టీలో చేరి పేదప్రజల కోసం పోరాటం సల్పసాగారు.

యాళ్ళూరి స్వామిరెడ్డి నందికొట్కూరు తాలుకాలోని బీరవోలు గ్రామంలో 1913 జూలై ఒకటవ తేదీన వెంకటరెడ్డి, శేషమ్మ దంపతులకు జన్మించారు. 8 ఏళ్ళ చిన్నవయసులోనే సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారు. 1929లో చెన్నైలోని పచ్చయ్యప్ప కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నప్పుడు స్వాతంత్ర్యోద్యమం వీరిని ఎంతగానో ప్రభావితం చేసింది. దానితో సైమన్ కమీషన్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు.

నందికొట్కూరు తాలుకాలో మద్యపాన వ్యతిరేక ఉద్యమాన్ని మిత్రుల సహాయంతో చేపట్టి సారా బట్టీలపై దాడి చేసి వాటిని ధ్వంసం చేశారు. కల్లు దుకాణాలను మూయించారు. 1932లో బ్రిటిష్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కమ్యూనల్ వార్డులకు వ్యతిరేకంగా మహాత్మాగాంధీ చేపట్టిన నిరాహార దీక్షకు మద్దతునిస్తూ తాను కూడా సత్యాగ్రహంలో పాల్గొన్నాడు.

1939లో జంగం తిప్పయ్య అనే వ్యక్తి ప్రభుత్వానికి పన్నులు చెల్లించకపోవడంతో తన ఎద్దులను వేలం వేస్తుంటే సహచరులతో అడ్డం పడ్డాడు. విదేశీ వస్తువులను బహిష్కరించి స్వదేశీ


Masterkranthi.R
2016

వస్తువులకు, చేతి వృత్తులకు సహకారాన్ని అందజేయాలని ఉద్యమం చేపట్టారు. వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొని ప్రభుత్వ నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘించి, ప్రజలను సమీకృతం చేసి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. పోలీసులు ఈ సందర్భంలో వీరిని చాలా తీవ్రంగా హింసించి, లాఠీలతో కొట్టి, ఒక నెల పాటు కారాగారంలో బంధించారు. ఐనా వీరి కార్యదీక్ష, పట్టుదల కొంచెం గూడా సడలలేదు. 1942 క్విట్ఇండియా ఉద్యమంలో విప్లవ చర్యలకు పాల్పడి పద్దెనిమిది నెలలు కారాగారశిక్షను అనుభవించారు.

1944లో వీరు కమ్యూనిస్టు పార్టీలో చేరారు. 1945లో నంద్యాలలో రైతులకు రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించారు. కమ్యూనిస్టు పార్టీ నిర్ణయానుసారం ఉద్యమాలలో చురుగ్గా పాల్గొన్నారు. స్వాతంత్ర్యానంతరం కమ్యూనిస్టు పార్టీని ప్రభుత్వం నిషేధించడంతో వీరు అజ్ఞాతజీవితం గడుపుతూ తెలంగాణా సాయుధ పోరాటంలో పాల్గొంటూ మహబూబ్‌నగర్, నల్గొండ ప్రాంతాలలో ఉద్యమ నిర్మాణం చేశారు. కమ్యూనిస్టు పార్టీపై ప్రభుత్వం నిషేధం ఎత్తివేశాక జరిగిన ఎన్నికలలో నందికొట్కూర్ ప్రాంతం నుండి పోటీ చేసిన కమ్యూనిస్టు అభ్యర్థి చంద్రపుల్లారెడ్డి గెలుపు కోసం ఎంతగానో శ్రమించారు.

1978లో రష్యాలో నెలరోజులపాటు పర్యటించి రష్యా కమ్యూనిస్టు పార్టీ నేతలతో జరిగిన చర్చలలో పాల్గొన్నారు. కర్నూలు జిల్లా భారత కమ్యూనిస్టు పార్టీకి కార్యదర్శిగా, రాష్ట్రకార్యవర్గ సభ్యునిగా పని చేస్తూ కర్నూలుజిల్లా అంతటా పార్టీని బలోపేతం చేస్తూ, పేద ప్రజల కోసం, రైతు సమస్యలను తీర్చడం కోసం అనేక పోరాటాలు చేశారు.

1981 ఆగష్టు 17వ తేదీన స్వర్గస్తులైన వీరు స్వాతంత్ర్య సమరయోధునిగా, విప్లవ వీరునిగా, నిజాయితీపరుడైన కార్యకర్తగా, పేదప్రజల పక్షపాతిగా పలువురి మనసుల్లో చెరగని ముద్ర వేశారు. అందుకే కర్నూలు పట్టణంలోని ఒక కాలనీకి 'స్వామిరెడ్డి నగర్' అని వీరి పేరు పెట్టడమే కాకుండా, శ్రీశైలంలోని కమ్యూనిస్టు కార్యాలయాన్ని వీరి పేరుతో నిర్మించడం జరిగింది.


గామాగో

ఇతను ఒక విశిష్టమైన వ్యక్తి. బనగానపల్లె నవాబుకు వ్యతిరేకంగా అతను జరిపిన పోరాటం అసామాన్యమైనది. పేదప్రజల పట్ల అతనికున్న ఆకాంక్ష వెలకట్టలేనిది. గాంధీగారి అహింసా సిద్ధాంతాన్ని, మార్క్స్ చెప్పే ఆర్థిక సిద్ధాంతాన్ని, గోరా బోధించే నాస్తికవాదాన్ని అమితంగా ఇష్టపడే శ్రీ ముక్కమళ్ళ వేంకట సుబ్బారెడ్డి ఆ ముగ్గురి పేర్లలోని మొదటి అక్షరాలని తీసుకోని తన పేరును "గామాగో" గా మార్చుకున్నాడు. వారి సిద్ధాంతాలను ఇష్టపడడమేగాక జీవితంలో ఆచరించి చూపాడు.

వీరు 1918 అక్టోబరు 23న శ్రీ బాల సంజీవరెడ్డి, నారమ్మ దంపతులకు కోయిలకుంట్ల తాలుకాలోని భీమునిపాడు గ్రామంలో జన్మించారు. చిన్ననాటి నుంచే చాలా చురుగ్గా వుండేవారు. ఇంటర్ చదువుతున్న రోజుల్లోనే 1939లో దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు గారి ప్రథమ వర్ధంతిని ఘనంగా జరిపారు. విద్యావికాసం ద్వారానే ప్రజాచైతన్యం సాధ్యమని నమ్మి నిరక్షరాస్యులైన హరిజనులకు, వెనుకబడిన వర్గాలకు రాత్రుళ్ళపూట వయోజన విద్యా పాఠశాలను ప్రారంభించి చదువు చెప్పేవారు. జాతీయోద్యమం గురించి, స్వేచ్ఛాస్వాతంత్ర్యాల గురించి, పరాయి పాలకుల దోపిడీ గురించి వివరిస్తూ ప్రజలలో దేశభక్తి బీజాలు నాటసాగారు. ఒకపక్క ప్రజాసేవ కార్యక్రమాలలో పాల్గొంటున్నా చదువును ఏ మాత్రం నిర్లక్ష్యం చేయలేదు. 1941లో ఇంటర్ డిస్టింక్షన్‌లో పాసయ్యారు. అదే సంవత్సరం చిన్న మల్లమ్మతో వివాహం జరిగింది. 1942లో మద్రాసుకు వెళ్ళి లయోల కాలేజీలో చేరారు.

1942లో క్విట్ఇండియా ఉద్యమం వువ్వెత్తున ఎగిసిపడింది. గామాగో చురుగ్గా ఇందులో పాల్గొంటూ ఇతర విద్యార్థులను కూడగట్టుకొని సమ్మెలు, హర్తాళ్ళు, కళాశాలల బహిష్కరణ, రైలురోకోలాంటి కార్యక్రమాలు విజయవంతంగా నడపసాగాడు. తన ఉపన్యాసాలతో విద్యార్థులను, ప్రజలను ఉత్సాహపరుస్తూ క్విట్ఇండియా ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించసాగాడు. దాంతో ఇంగ్లీషు ప్రభుత్వం వీరి కార్యకలాపాలపై కన్నెర్ర చేసింది. 1943 ఫిబ్రవరి 22న వీరు ఒక సభలో ఉపన్యాసం ప్రారంభించగానే ఒక్కసారిగా పోలీసులు చుట్టుముట్టి విపరీతంగా కొట్టి ఆసుపత్రిలో చేర్పించారు. తరువాత ఆరునెల్లు అల్లీపురం జైలులో కారాగార శిక్ష విధించారు.

క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో కాలేజీలు బహిష్కరించిన, జైలు పాలయిన విద్యార్థులకు ప్రభుత్వం మరలా కళాశాలలకు తిరిగి రావడానికి అనుమతినిచ్చింది. కానీ గామాగో ఆంగ్లేయ కళాశాలలో బానిసగా బ్రతకడానికి ఇష్టపడలేదు. తన చదువుకన్నా, దేశ స్వాతంత్ర్యమే ముఖ్యం అని భావించాడు. దానితో కళాశాల వదిలివేసి గాంధీగారి నాయకత్వంలో ఉధృతంగా జాతీయ ఉద్యమంలో పాల్గొన్నాడు.



డా॥ ఎం. హరి కిషన్

నివర్తి వేంకటసుబ్బయ్యను తన రాజకీయ గురువుగా పేర్కొనే వీరి యొక్క జీవితంలో అత్యంత ముఖ్యమైనది బనగానపల్లె నవాబుపై చేసిన పోరాటం. 1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా బనగానపల్లెకు మాత్రం రాలేదు. కారణం అది మొదటి నుంచి ఒక స్వతంత్ర సంస్థానంలా వుండడం. దానికి పాలకులైన నవాబులు సైన్యాన్ని కలిగి వుండి, ఆంగ్లేయులకు నిజాంలాగా కప్పం కడుతూ వుండేవాళ్ళు. వీరు భారతదేశంలో కలవడానికి ఒప్పుకోలేదు. ఈ నవాబులు నిరంకుశంగా వ్యవహరిస్తూ, ప్రజలను క్రూరంగా అణచివేస్తూ, విపరీతంగా శిస్తు వసూలు చేస్తూ, భోగలాలసత్వంతో జీవిస్తూ వుండేవాళ్ళు. స్థానిక నాయకులెవరూ వీరిని ఎదిరించలేక మిన్నకుండిపోయిన సమయంలో గామాగో ధైర్యంగా వారిని ఎదిరించి నిలిచాడు. ఒక్కొక్కరినే కూడదీసుకుంటూ బనగానపల్లె నవాబుకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాన్ని నిర్మించగలిగాడు. దానితో 1948 ఫిబ్రవరి 22న భారత ప్రభుత్వం సైనికచర్య ద్వారా బనగానపల్లెను స్వాధీనం చేసుకొని ప్రజలకు స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను ప్రసాదించింది.

1952, 1975లలో జరిగిన ఎన్నికలలో వీరు బనగానపల్లె నుండి శాసనసభ్యులుగా ఎన్నికైనారు. శాసనసభ్యునిగా వున్న సమయంలో రైలులో మూడవ తరగతిలోనే ప్రయాణం చేసేవారు. పదవుల గురించి, ధన సంపాదన గురించి ఎప్పుడూ పట్టించుకోలేదు. ప్రజాసేవే ప్రథమ కర్తవ్యంగా భావించేవాడు. అందుకే...

1954లో మరో గొప్ప పోరాటానికి తెర తీశాడు. ఆ రోజుల్లో కరివెన గ్రామంలో ఈనాం రైతులు అనేక కష్టాలు పడేవాళ్ళు. వీరికి ఎటువంటి హక్కులు వుండేవి కాదు. చెప్పులు చేతిలో పట్టుకొని ప్రధాన వీధులలో నడవాలి. దీనితో గామాగో వారి విముక్తి కోసం సత్యాగ్రహ మార్గం ఎన్నుకొన్నాడు. ప్రతిరోజు కులమతవర్గాలకు అతీతంగా సహపంక్తి భోజనాలు చేయిస్తూ అందరినీ సత్యాగ్రహ పోరాటంలో భాగస్వాములను చేశాడు. ఏ మాత్రం వెనుకడుగు వేయకుండా వీరు ఎంతో కాలం నిర్వహించిన ఈ సత్యాగ్రహం ద్వారా ఆఖరికి ఈనాం భూముల విషయం రాష్ట్రానికంతా తెలిసింది. దానితో ప్రభుత్వం "ఈనాం రద్దు బిల్లు"ను అసెంబ్లీ ద్వారా చట్టంగా తీసుకు వచ్చింది. అప్పటి రెవెన్యూశాఖా మంత్రి నరసారెడ్డి స్వయంగా కరివెనకు వచ్చి గామాగో చేతనే ఈనాం రైతులకు పట్టాలిప్పించాడు. వీరి సత్యాగ్రహం ద్వారా ఒక్క కరివెనలోనేగాక రాష్ట్రంలోని మూడువేల ఈనాంలు తొలగిపోయి అనేకమంది రైతులు వెట్టిచాకిరీ నుంచి విముక్తులయ్యారు. వీరు ఆ తరువాత ఇందిరాగాంధీ విధానాలతో విభేదించి జనతాపార్టీలో చేరారు. నంద్యాల పార్లమెంటరీ మెంబరుగా నీలం సంజీవరెడ్డిగారిని గెలిపించడంలో విశేష కృషి సల్పారు.

వీరు ఎం.వి. ముత్తయ్యగారు ఆంగ్లంలో రచించిన గ్రంథాన్ని తెలుగులో "నెహ్రూ కాలం నాటి మధుర స్మృతులు" అనే పేరుతో అనువదించారు. ఆ తరువాత తనకు ఇష్టమైన "మార్క్సు జీవితం సిద్ధాంతాలు" అనే గ్రంథాన్ని తెనిగిస్తున్న సమయంలో గుండెపోటు రావడంతో స్వర్గస్తులయ్యారు. వీరి జీవితంలోని అనేక సంఘటనలను వివరిస్తూ 'విస్మృత కార్యకర్త' అనే పేరుతో తన స్వీయచరిత్రను రచించారు. దీనిని చదివితే వీరి త్యాగనిరతి, బనగానపల్లె సంస్థానంలో వీరు జరిపిన అలుపెరుగని పోరాటం, ప్రజాసంక్షేమం కోసం చేసిన కృషి మన కళ్ళ ముందు సాక్షాత్కరిస్తాయి.

దామోదరం సంజీవయ్య

భారతదేశంలోనే మొట్టమొదట ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయిన దళితుడు. అఖిల భారత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షుడయిన తొట్ట తొలి దళితుడు దామోదరం సంజీవయ్యనే. వీరు రాజకీయవాదే అయినా సాహిత్యమన్నా, నాటకాలన్నా చాలా ఇష్టపడేవాడు. భీష్ముని జననాన్ని ఇతివృత్తంగా తీసుకొని హరికథను, నాటకాన్ని రచించారు. అంతేకాక శశిరేఖా పరిణయం అనే నాటకం గూడా రచించారు. చిన్నప్పుడు అనేక నాటకాలలో నటించి ప్రేక్షకుల చేత ప్రశంసలు కూడా పొందారు.

దామోదరం సంజీవయ్య కర్నూలు టౌన్‌కు అతి దగ్గరలో గల పెద్దపాడులో 1921 ఫిబ్రవరి 14న జన్మించారు. తల్లి సుంకులమ్మ. తండ్రి మునెయ్య. సంజీవయ్య జన్మించిన మూడు నెలలకే వీరి తండ్రి మరణించారు. దాంతో మేనమామ గుండయ్య వీరిని ఆదుకున్నాడు. చిన్నప్పటి నుంచే శ్రావ్యంగా పద్యాలు పాడేవారు. వీరు ప్యాలకుర్తి వీధిబడిలో, అమెరికన్ బాప్టిస్టు చర్చ్ (కర్నూలు)లోనూ ప్రాథమిక విద్యను పూర్తి చేసుకొని మునిసిపల్ హైస్కూల్లో సెకండరీ విద్య పూర్తి చేశారు. కాలేజీలో పుట్టపర్తి నారాయణాచార్యులు వీరి తెలుగు లెక్చరర్. వారి వల్ల సాహిత్యంపై బాగా అభిమానం పెరిగింది. 1949లో లా పూర్తి చేశారు.

1942లో డిగ్రీ పట్టా చేతికి వచ్చింది. పై చదువులు చదవాలంటే ఆర్థిక పరిస్థితులు సహకరించలేదు. సివిల్ సప్లయిస్ డిపార్ట్‌మెంట్‌లో గుమాస్తాగా చేరి ఇన్‌స్పెక్టర్‌గా కొంత కాలం పని చేసి డబ్బు కూడబెట్టుకుని ఉద్యోగానికి రాజీనామా చేసి మద్రాసులో లా కాలేజీలో చేరి 1950కు చదువు పూర్తి చేశాడు. ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్న సమయంలో అనుకోకుండా రాజ్యాంగ సభకు రిజర్వుడు స్థానంలో ఉపఎన్నిక జరగడం, దామోదరం సంజీవయ్యను అందుకు కాంగ్రెసు పార్టీ నిలపడం, అతను గెలవడం జరిగిపోయింది.

1952లో జరిగిన జనరల్ ఎలక్షన్లలో పత్తికొండ రిజర్వు స్థానం నుంచి గెలుపొంది దామోదరం సంజీవయ్య రాజాజీ మంత్రివర్గంలో గృహనిర్మాణ, సహకారశాఖల మంత్రిగా నియమితుడయ్యాడు. రాజాజీ మంత్రివర్గంలో అందరికంటే చిన్నవాడు సంజీవయ్యనే. అందివచ్చిన పదవిని చక్కగా నిర్వర్తిస్తూ అందరి చేత ప్రశంసలు అందుకొన్నాడు. ఆ తరువాత ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కర్నూలు రాజధానిగా ఏర్పడినపుడు టంగుటూరి ప్రకాశం మంత్రివర్గంలో సాంఘిక సంక్షేమం, ప్రజా ఆరోగ్య శాఖలకు మంత్రిగా నియమితులయ్యారు. 1954లో శ్రీమతి కృష్ణవేణమ్మతో వీరికి వివాహం జరిగింది. 1955లో ప్రకాశం పంతులు ప్రభుత్వం పతనమై మధ్యంతర ఎన్నికలు జరిగాయి. అందులో ఎమ్మిగనూరు నుంచి ఇరవై వేల మెజార్టీతో గెలుపొందాడు. బెజవాడ గోపాలరెడ్డి మంత్రివర్గంలో రవాణా, సహకార శాఖల మంత్రిగా పని చేశారు.


Masterkranthi.R
2016

1956 నవంబర్ 1న ఆంధ్రరాష్ట్రం, తెలంగాణా కలసి ఆంధ్రప్రదేశ్ అవతరించింది. నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా నియమించబడ్డాడు. ఆయన మంత్రివర్గంలో స్థానిక సంస్థల పరిపాలన, కార్మిక శాఖల మంత్రిగా కొంతకాలం పని చేశాడు. 1960లో నీలం సంజీవరెడ్డి అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షులుగా నియమించబడడంతో ముఖ్యమంత్రి పదవి ఖాళీ అయింది. దాని కోసం అల్లూరి సత్యనారాయణరాజు, కాసు బ్రహ్మానంద రెడ్డి పోటీ పడ్డారు. సభ్యులంతా రెండు వైపులా చీలిపోయారు. ఈ సమయంలో కాంగ్రెస్ నాయకత్వం ఎటువంటి వివాదాలలో తలదూర్చని, నిజాయితీపరుడైన, సమర్థుడైన దామోదరం సంజీవయ్యను ముఖ్యమంత్రిగా సూచించింది. దాంతో రెండు వర్గాలు సంజీవయ్యను ఒప్పుకోవడంతో భారతదేశంలో మొట్టమొదటిగా ఒక దళితుడు ముఖ్యమంత్రి పదవిని చేపట్టడానికి మార్గం సుగమమయ్యింది.

సంజీవయ్య భూమి లేని నిరుపేదలకు ఆరు లక్షల ఎకరాల బంజరు భూమిని పంచిపెట్టి భూసంస్కరణల చట్టం చేశాడు. దీని అమలులో ఇబ్బందులు తొలగించడానికి స్టేట్ లా కమీషన్ ఏర్పరచారు. హైదరాబాద్, సికిందరాబాద్ జంట నగరాలను కలిపి ఒకే కార్పొరేషన్‌గా తయారు చేశారు. ప్రభుత్వ శాఖలలో పరిపాలనా భాషగా తెలుగును అమలుపరిచారు. వీరికి సాహిత్యమంటే ఎనలేని ప్రేమ. అఖిల భారత తెలుగు రచయిత సంఘానికి అధ్యక్షులుగా పని చేశారు. సాహిత్య కార్యక్రమాలను ప్రోత్సహించారు. దేశంలోనే మొట్టమొదటి "బాలికల పాలిటెక్నిక్ కాలేజీ"ని హైదరాబాద్‌లో స్థాపించారు. పులిచింతల ప్రాజెక్టుకు పునాది రాయి వేశారు. అవినీతి, లంచగొండితనాలను అరికట్టడానికి యాంటీకరప్షన్ బ్యూరోను ఏర్పాటు చేశారు. 1962లో సాధారణ ఎన్నికలు వచ్చాయి. అందులో కోడుమూరు నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు. నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా తిరిగి వచ్చారు. తరువాత సంజీవయ్య 1962లో అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఎన్నికయ్యారు. ఆ తరువాత కేంద్రంలో జవహర్‌లాల్ నెహ్రూ, లాల్‌బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీలు ప్రధానమంత్రులుగా వున్నప్పుడు వివిధ శాఖలను మంత్రిగా సమర్థవంతంగా నడిపాడు.

వీరికి తెలుగు భాషపై మంచి పట్టు వుంది. ఉపన్యాసాలలో పద్యాలను, చాటువులను, చక్కని తెలుగు సామెతలను సందర్భోచితంగా ప్రయోగిస్తూ, రాగయుక్తంగా ఆలపిస్తూ శ్రోతలను కట్టిపడేసేవాడు. సంజీవయ్య గొప్ప వక్త. నిజాయితీపరుడు. మేధావి. సాహిత్యాభిమాని. సమర్థుడైన మచ్చలేని రాజకీయ నాయకుడు. పేదల కోసం ఎన్నో ప్రణాళికలు అమలు చేసి వారి అభ్యున్నతికి పాటుపడిన వ్యక్తి. ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తూ 1972 మే 7న ఢిల్లీలో గుండెపోటుతో స్వర్గస్తులయ్యారు.

తినడానికి తిండి గూడా లేని నిరుపేద కుటుంబంలో పుట్టి అత్యున్నత శిఖరాలను అధిరోహించిన సంజీవయ్యకు గుర్తుగా వీరు కర్నూల్లో చదివిన మునిసిపల్ హైస్కూల్‌కు దామోదరం సంజీవయ్య స్మారక పురపాలక ఉన్నత పాఠశాల అని పేరు పెట్టారు. అంతేగాక పెద్దపాడులోని పాఠశాలకు, విద్యార్థుల వసతి గృహానికి వీరి పేరే పెట్టారు. కర్నూలులోనూ, హైదరాబాదులోనూ వీరి విగ్రహాలు ప్రతిష్టించారు. గోనెగండ్లలోని హంద్రీ నదిపై నిర్మించిన ప్రాజెక్టుకు సంజీవయ్య సాగర్ అని పేరు పెట్టి వారు చేసిన సేవలను స్మరించుకొన్నారు.

గుర్రం వెంకటరెడ్డి

కర్నూలు జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల సంఘానికి అధ్యక్షులుగానూ, ఆంధ్రప్రదేశ్ సమరయోధుల సంఘానికి ఉపాధ్యక్షులుగానూ ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన గుర్రం వెంకటరెడ్డి జీవితమంతా పోరాటాలు, త్యాగాలతో నిండి వుండి అందరికీ ఆదర్శంగా వుంటుంది.

వీరు 1921లో వెలుగోడులో జన్మించారు. ప్రాథమిక విద్యను అక్కడే అభ్యసించి, కర్నూలు మునిసిపల్ హైస్కూల్‌లో సెకండరీ విద్యను, మదనపల్లెలో కళాశాల విద్యను పూర్తి చేశారు. వీరిది రైతు కుటుంబం. చదువుకొనే దశలో విప్లవ గ్రంథాల అధ్యయనం చేశారు. భారత స్వాతంత్ర్య పోరాటం వీరిని ఆకర్షించింది.

1939లో బాబూ రాజేంద్రప్రసాద్ కర్నూలుకు వచ్చినపుడు ఆ సభలో పాల్గొని ప్రసంగించారు. 1941 ఎన్నికలలో కాంగ్రెస్ గెలుపు కోసం ఎంతగానో కృషి చేశారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమకాలంలో ఆంగ్ల ప్రభుత్వం నాయకులందరినీ అరెస్టు చేసి జైళ్ళకు తరలించింది. దానిని నిరసిస్తూ నిరసన సభలూ, సమావేశాలు నిర్వహించారు. దానితో బ్రిటిష్ ప్రభుత్వం వీరిని గూడా బంధించి ఒక సంవత్సరం పాటు కఠిన కారాగార శిక్ష విధించింది. ఆ తరువాత వీరి మనసు విప్లవ పోరాటాల వైపు మళ్లింది. జైలు నుండి విడుదలయ్యాక కమ్యూనిస్టు పార్టీలో చేరి ప్రధాన కార్యదర్శిగా పని చేశారు.

1943లో రాములమ్మ అనే ఉపాధ్యాయురాలిని వర్ణాంతర వివాహం చేసుకున్నారు. దానితో ప్రభుత్వం ఆమెను ఉద్యోగం నుంచి సస్పెండు చేసి సర్టిఫికెట్ వెనక్కు తీసుకుంది. వెంకటరెడ్డి అజ్ఞాతంలో వుంటూ పోలీస్ దాడుల నుంచి తప్పించుకుంటూ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. వీరి భార్య రాములమ్మ గూడా భర్తను అనుసరిస్తూ చిన్నపిల్లవానితో, భర్తతో పాటు అజ్ఞాత జీవితం గడిపింది. చివరికి వీరు పోలీసులకు దొరికిపోయారు. వీరిని బళ్ళారి సెంట్రల్ జైలు నుండి రాజమండ్రి జైలుకు మారుస్తున్న సమయంలో అర్ధరాత్రి రైలు నుండి దూకి తప్పించుకున్నారు. మూడు సంవత్సరాలపాటు అజ్ఞాత జీవితం గడిపారు. ప్రభుత్వం వీరిపై కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులు జారీ చేసి, పట్టి ఇచ్చిన వారికి పదివేలు బహుమతి ప్రకటించడం జరిగింది.



డా॥ ఎం. హరి కిషన్

గెరిల్లా పోరాటం నీరుగారిపోయి, కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకొని ఎన్నికలకు సిద్ధపడడంతో వీరు అజ్ఞాతం నుండి బైటపడి అరెస్టయ్యారు. వీరిపై బనాయించిన కేసులన్నీ కోర్టు కొట్టివేయడం జరిగింది. 1962 వరకు దాదాపు రెండున్నర దశాబ్ధాల పాటు కమ్యూనిస్టు పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ పార్టీని బలోపేతం చేయడానికి నిరంతరం కృషి చేస్తూ పేద ప్రజల కోసం అనేక పోరాటాలు చేశారు. కానీ కొన్ని కారణాల వల్ల మనసు గాయపడి 1962 లో పార్టీకి దూరమై కొంత కాలానికి కాంగ్రెస్ పార్టీలో చేరారు.వీరు

తన మిత్రుడు పోచన రామిరెడ్డితో కలిసి 'విప్లవయోగి - విశ్వకవి - వేమన వేదశాస్త్రం' అనే గ్రంధాన్ని రచించడం జరిగింది. వేమనను గొప్ప సంఘసంస్కర్తగా, దార్శనికునిగా, ప్రజల్లో మార్పు తీసుకు రావడం కోసం సాహిత్యాన్ని ఉపయోగించిన విప్లవ కవిగా కీర్తించాడు.

వీరు మొదటినుంచీ చాలా నిరాడంబరులు. ఎటువంటి పదవులు ఆశించలేదు. ఎన్నికలలో పోటీ చేయడానికి ఆసక్తి చూపలేదు. సన్మానాలన్నా, పొగడ్తలన్నా ఇష్టపడేవారు కాదు. వాటికి చాలా దూరంగా వుండేవాదిరి. తనకు స్వాతంత్ర్య సమరయోధునిగా వస్తున్న పెన్షన్ గూడా ప్రజల సేవా కార్యక్రమాలకే వినియోగించిన వీరు ఇటీవలే 2005న స్వర్గస్తులయ్యారు.

నమ్మిన ఆశయాల కోసం ఎంతటి శ్రమకైనా ఓర్చుకొని, అన్ని కష్టాలను భరిస్తూ, ఎటువంటి పదవులనూ ఆశించని నిజమైన దేశభక్తుడు గుర్రం వెంకటరెడ్డి. ఇటువంటి వారి జీవితం ప్రజలందరిలో ఒక నూతన ఉత్తేజానికి మొక్కవోని ఆశయదీక్షకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది.



నాటి చరిత్రకు ఆధారంగా బనగానపల్లెలోని పాతపాడు బంగ్లా


పెండేకంటి వెంకటసుబ్బయ్య

ఇరవై ఏడు సంవత్సరాల సుదీర్ఘకాలం లోక్‌సభ సభ్యునిగా పని చేసి, గవర్నర్ పదవులను అలంకరించి, అనేక విద్యా సంస్థలను ఏర్పరచిన స్వాతంత్ర్య సమరయోధుడు పెండేకంటి వెంకటసుబ్బయ్య. వీరు 1927 జూన్ 18న సంజామల గ్రామంలో లక్ష్మిదేవమ్మ, పెద్దసుబ్బయ్య దంపతులకు జన్మించారు.

వీరు ఉన్నత పాఠశాలలో చదివే రోజుల్లోనే జాతీయ భావాలను కలిగి వుండి విద్యార్థి సంఘాలకు నాయకత్వం వహిస్తూ వుండేవారు. విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయుల, జిల్లా అధికారుల ఆదేశాలను ఏ మాత్రం లెక్కచేయకుండా శ్రీ జయప్రకాష్ నారాయణ్, బాబూ రాజేంద్రప్రసాద్‌లాంటి నాయకులను ఆహ్వానించి వారి ప్రసంగాల ద్వారా ప్రజల్లో జాతీయ చైతన్య స్ఫూర్తిని రగిలించేందుకు కృషి చేశానే.

మెట్రిక్యులేషన్ అవగానే మదనపల్లెలోని థియోసాఫికల్ కాలేజీలో చేరాడు. కాలేజీలోని అధ్యాపకులు, ప్రిన్సిపల్ వల్ల జాతీయ భావాలు, స్వాతంత్ర్యకాంక్ష పెంచుకున్నారు. ఆ కాలేజీలో ఖద్దరు దుస్తులు ధరించి తిరిగే విద్యార్థి వీరొక్కరే. మౌలానా అబ్దుల్ కలాం అజాద్ గారిని అరెస్ట్ చేసినపుడు దానికి నిరసనగా విద్యార్థులతో ప్రదర్శన నిర్వహించి అరెస్టయ్యారు. ఆ తరువాత చదువును వదిలివేసి పూర్తిగా జాతీయోద్యమానికే జీవితాన్ని అంకితం చేశారు. క్విట్ ఇండియా మూవ్‌మెంట్ కార్యకలాపాల్లో చాలా చురుగ్గా పాల్గొన్నారు.

సంజామల గ్రామానికి 20 సంవత్సరాలపాటు సర్పంచు పని చేసిన వీరు బనగానపల్లె నవాబుకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. బనగానపల్లెలో విద్యాస్థాయిని విస్తృతపరచడాన్ని అప్పటి నవాబు నిషేధించాడు. కానీ వీరు తండ్రిగారి అండదండలతో తమ గ్రామంలో ఒక పాఠశాలను ప్రారంభించారు. స్వాతంత్ర్యానంతరం బనగానపల్లె నవాబు భారతదేశంలో విలీనం కావడానికి ఒప్పుకోక తన సంస్థానాన్ని స్వతంత్రంగా వుంచాడు. దానికి వ్యతిరేకంగా గామాగోలాంటి వారితో కలసి పోరాడారు. నవాబు నిరంకుశ పరిపాలనకు వ్యతిరేకంగా స్టేట్ కాంగ్రెస్ ఏర్పడ్డంలో సహాయపడ్డారు. దాని ఫలితంగా కారాగారవాసం అనుభవించవలసి వచ్చింది. ఐనా ఏ మాత్రం వెనుకంజ వేయకుండా కార్యకర్తలను ప్రోగు చేస్తూ నవాబు నిరంకుశ


Masterkranthi R
2016

పరిపాలనకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి బనగానపల్లె సంస్థానం ఇండియన్ యూనియన్‌లో విలీనమయ్యేందుకు కృషి చేశారు.

బనగానపల్లె, కర్నాటకలోని సాందూరు నియోజక వర్గాలకు శాసనసభ్యునిగా పని చేశారు. బనగానపల్లెలో చాలా ఎక్కువగా వున్న భూమిశిస్తును ఇతర ప్రాంతాల్లో వున్న శిస్తుతో సమానంగా చేసేలా కృషి చేశారు. వీరు కర్నూలు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులుగానూ, ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీగానూ పనిచేశారు. జవహర్‌లాల్ నెహ్రూ పర్యటన సందర్భంలో వారి ఉపన్యాసాలను తెలుగులోనికి అనువదించారు. వినోభాభావే భూదానోద్యమంలో భాగంగా ఇక్కడికి వచ్చినపుడు తన స్వంతభూమిని విరాళంగా ఇచ్చివేశారు. వీరి సతీమణి కనకమ్మగారు కూడా తనకు వచ్చిన యావదాస్తినీ విరాళంగా ఇచ్చివేశారు. కులమతాలకతీతంగా పిల్లలకు వివాహాలు జరిపించారు.

జవహర్‌లాల్ నెహ్రూ, శ్రీమతి ఇందిరాగాంధీ, లాల్‌బహుదూర్ శాస్త్రి, రాజీవ్‌గాంధీల కాలంలో వీరు అనేక పదవులు నిర్వహిస్తూ 27 సంవత్సరాలపాటు (1957 నుండి 1984 వరకు) లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించారు. ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా వున్నప్పుడు 1980లో హోమ్ మరియు పార్లమెంటరీ వ్యవహార మంత్రిగానూ, రాజీవ్‌గాంధీ కాలంలోనూ మంత్రిగా వున్నారు. వీరు 1967లో పార్లమెంటులో పార్టీ ఫిరాయింపులకు వ్యతిరేకంగా తీర్మానం ప్రవేశ పెట్టారు. రైతుల సమస్యలను ప్రస్తావించడానికి పార్లమెంటులో ఏరప్పడిన ఫార్మర్స్ పార్లమెంటరీ ఫోరంకు వ్యవస్థాపక కార్యదర్శిగా పని చేశారు. నంద్యాల ప్రాంతంలో మొట్టమొదటిసారిగా రైతుల కోసం చక్కెర కర్మాగారాన్ని స్థాపించి చైర్మన్‌గా కొనసాగారు. రాయలసీమలో ఎన్నో మధ్యతరహా, చిన్నతరహా, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులను నిర్మించేలా కృషి చేశారు. కృష్ణానది నుంచి శ్రీశైలం కుడికాలువను, నంద్యాల నుంచి ఎర్రగుంట్లకు రైల్వేలైనును సాధించారు. వీరు ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఐటిఐ, ఆర్ట్స్ కళాశాలలను, కొన్ని పాఠశాలలను స్థాపించి నంద్యాల ప్రాంతంలో విద్యావ్యాప్తికి ఎంతగానో కృషి చేశారు. గొప్ప వక్త, మంచి రచయిత అయిన వీరు రాజ్యాంగాన్ని సంక్షిప్తీకరించి తెలుగులో అందరికీ అర్థమయ్యేలా 'మన రాజ్యాంగం' అనే గ్రంథాన్ని రచించారు. బీహారు, కర్నాటక రాష్ట్రాలకు గవర్నర్‌గా పని చేసిన వీరు 1993లో హైదరాబాదులో స్వర్గస్తులయ్యారు. గ్రామీణ స్థాయి నుంచి అఖిల భారత స్థాయి వరకూ ఎదిగి రాయలసీమ కోసం ఎంతగానో కృషి చేసి ఇక్కడి ప్రజల మనస్సులలో శాశ్వత స్థానం సంపాదించుకున్నారు.

డా॥ ఎం. హరికిషన్ రచనలు

1. మాయమ్మ రాచ్చసి
2. నయాఫత్వా
3. నేనూ మా అమ్మ
4. మూడు అబద్దాలు
5. ఒక చల్లని మేఘం
6. కందనవోలు కథలు
7. టీచర్ చెప్పిన కథలు

చరిత్ర

8. కర్నూలు జిల్లా చరిత్ర
9. కొండారెడ్డి బురుజు
10. కర్నూలు జిల్లా మహనీయులు

సంపాదకత్వం

11. కర్నూలు కథ

బాల సాహిత్యం

12. ఉంగురుబిళ్ళ
13. నక్కబావ - పిల్లిబావ
14. చిన్నారి గేయాలు
15. జానపద గేయాలు
16. తేనేటీగ - కందిరీగ
17. బంగారు చేప - గంధర్వకన్య
18. మెరుపుల వాన
19. పావురం దెబ్బ
20. చెప్పుకోండి చూద్దాం
21. బొమ్మలతో సామెతలు - 1
22. బొమ్మలతో సామెతలు - 2
23. తిక్క కుదిరిన నక్క
24. నమ్మొద్దురా నాయనా దొంగ నక్కల్ని
25. మూతి పగిలిన పిల్లి
26. రాము టోపి
27. కుందేలు దెబ్బ
28. ఒక వీరుని కథ
29. పుచ్చకాయ తపస్సు
30. సముద్రంలో చిన్నచేప
31. కోటకొండ మొనగాడు
32. బూర
33. తేనె చినుకులు
34. పిండిబొమ్మ వీరుడు
35. పిల్లలు కాదు పిడుగులు
36. నాకు మూడు - నీకు రెండు
37. కిర్రు కిర్రు లొడ్డప్పా
38. ఒకటి తిందునా రెండు తిందునా
39. నలుగురు మూర్ఖులు
40. కమ్మని ఊహలు
41. చిలుక ముక్కు పూడిపాయ
42. రేపటి వెలుగులు
43. నల్లకుక్క
44. రెక్కల ఎలుక
45. టక్కరికోతి
46. అమ్మో దయ్యం
47. మంచిమాట చెబుతా
48. చేయి చేయి కలుపుదాం
49. చందమామలో కుందేలు
50. మూడు కోరికలు
51. గాడిద మెచ్చిన పాట
52. ఛం... ఛం... చుక చుక
53. లబో దిబో
54. గొడవపడకు - దెబ్బ తినకు
55. మిన్ను
56. తిండిపోతు దయ్యం
57. సోమరిపోతు మహావీరుడు
58. బొమ్మలు చెప్పిన కమ్మని కథలు
59. రాయలసీమ జానపద హాస్యకథలు
60. తెలుగువారి జానపద కథలు
61. పిల్లలు మెచ్చిన వంద కథలు
62. కథల ఖజాన
63 మోసగాళ్ళ దేశం
64. చందమామ చెప్పిన కథలు
65. యువరాణి లాస్య

ఆంగ్ల భాషలోనికి అనువాదాలు

66. Kurnool District's History
67. Tales by Dolls
68. Creative Thoughts

హిందీ భాషలోనికి అనువాదం

69. తుర్హీ (బూర)

70. కన్నడ భాషలోనికి అనువాదం

పుట్టి మత్తు చిట్టె (సీతాకోక చిన్నది)

డా॥ ఎం. హరికిషన్ రచించిన 50వ పుస్తకం ఇది. సామాజిక సమస్యలపై స్పందిస్తూ కథా రచన చేసే వీరు చిన్నారుల కోసం ప్రేమతో ఒత్తులు, సంయుక్తాక్షరాలు లేకుండా అనేక పుస్తకాలు రూపొందించారు. కర్నూలు జిల్లా చరిత్రకు సంబంధించిన వివిధ విషయాలను అందరికీ అర్థమయ్యేలా సులభశైలిలో రచిస్తున్నారు.




డా॥ ఎం. హరి కిషన్





మాస్టర్ క్రాంతి

కర్నూలుజిల్లాకు చెందిన చిత్రకారుడు రేపల్లె మాస్టర్ క్రాంతి జేఎన్‌టియులో ఫైన్ ఆర్ట్స్ పూర్తి చేశారు. 'మాస్టర్స్ మ్యూజ్' పేరుతో డ్రాయింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేసి చిన్నారులకు చిత్రకళలో మెళకువలను నేర్పిస్తున్నారు. కందనవోలు కథలు, విభజనరేఖలు మొదలగు పుస్తకాలకు ముఖచిత్రాలు అందించారు.





























కర్నూలు బుక్ ట్రస్ట్



విజ్ఞాన ప్రచురణలు
(జనవిజ్ఞాన వేదిక)